thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 54 | జగిత్యాల | శనివారం | 16 మే, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

### చెన్నైకి లక్నో పంచ్


11

## జూన్ 21న 'నీట్' రీ-ఎగ్జామ్

ప్రశ్నపత్రం లీకేజీతో రద్దయిన పరీక్షకు కొత్త షెడ్యూల్ విడుదల

గతేడాది లీక్ మాఫియాపై సీబీఐ దృష్టి

వచ్చే ఏడాది నుంచి పూర్తిగా ఆన్‌లైన్ విధానం: కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

4





## పెట్రో, డీజిల్ ధరల పెరుగుదల

4

లీటర్‌పై కనీసంగా రూ.3 పెంపు

ధరలు పెంచుతూ ఆయిల్ కంపెనీల నిర్ణయం



### గూడులేని ప్రతి పేద కుటుంబానికి
## సొంత ఇల్లు

**ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియ**

**జూన్ 2 నుంచి ఆదిలాబాద్‌లో రెండో విడత ప్రారంభం**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్, మే 15(చురకలు):** పేద కుటుం బానికి సొంత ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదని, అది ఆత్మగౌరవానికి, భద్రమైన భవిష్యత్తుకు ప్రతీక అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తోందని స్పష్టం చేశారు. శుక్రవారం హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్ట్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు.

మిగతా 2 లో

## హైదరాబాద్‌కు 'హైస్పీడ్' వెలుగులు

ముంబై, బెంగళూరు, చెన్నైలకు బుల్లెట్ రైళ్లు!

ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సీఎస్ రామకృష్ణారావు ఆదేశం

3



## 2034 వరకు
# నేనే సీఎం

### ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లోకి..

రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా పనిచేస్తా

రాహుల్ తర్వాత సెకండ్ ప్లేస్ ఆక్రమిస్తా

మరోమారు రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

> సీఎం రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రస్థానంపై మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాబోయే పదేళ్ల పాటు అంటే 2034 వరకు సీఎంగా తానే కొనసాగుతానని, ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశిస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని దేశ ప్రధానిని చేయడమే తన ప్రధాన లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



**హైదరాబాద్, మే 15(చురకలు):** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 2034లో రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించి జాతీయ రాజకీయాల్లోకి వెళ్తానని చెప్పారు. అప్పటి వరకు తానే సీఎంగా ఉంటానన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన లక్ష్యమని చెప్పారు. జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి రాహుల్ తర్వాతి స్థానంలో ఉంటానని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే రాహుల్ గాంధీ లక్ష్యమన్నారు. ఆయనకు ప్రధాని కావాలనే కోరిక లేదని.. ఆ పదవికి పోటీ పడాలని తాను ఒప్పించానని రేవంత్ చెప్పారు. గాంధీ కుటుంబానికి దేశం పట్ల విశ్వాసం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తనకు చాలా చొరవ ఉందని పేర్కొన్నారు. తన గీత తాను దాటనని స్పష్టం చేశారు.

### బండి సంజయ్ కుమారుడిని
## అప్పగించాలి


2

నైతికత నిరూపణలకు ఇదే సమయం

పారిపోవడం సరికాదు

కుమారుడి తీరుతో తండ్రికి తలవంపులు..

సీఎం రేవంత్ రెడ్డి

## జహీరాబాద్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్


**రూ.650 కోట్ల పెట్టుబడితో భారీ ఫుడ్ ఇండస్ట్రీ**

**దామోదరతో కలిసి ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు**

**ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం అని వెల్లడి**

3



### తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు
## ప్రత్యేక కమిటీ

డాక్టర్ కేశవరావు చైర్మన్‌గా నియామకం

ఉద్యమ త్యాగాలు, సేవలకు అధికారిక గుర్తింపు కల్పించనున్న ప్రభుత్వం

2

## బండి సంజయ్‌పై దుష్ప్రచారం ఆపండి

ఆయన ప్రతిష్టను దెబ్బతీసే పోస్టులు, వీడియోలను తక్షణమే తొలగించాలి

సిటీ సివిల్ కోర్టు కీలక ఉత్తర్వులు

2




2

## న్యాయం కోసమే మా పోరాటం

కన్నీటి పర్యంతమైన బండి భగీరథ బాధిత బాలిక తల్లి

కుమార్తె భద్రత, గౌరవంపై ఆందోళన..

నిందితుడిని కఠినంగా శిక్షించాలని సుదీర్ఘ లేఖ విడుదల




### పెట్రో ధరల పెంపు
## అనివార్యం

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌వి పనీపాటలేని విమర్శలు**

**మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్(చురకలు):** పెట్రోల్, డీజిల్ ధరల పెంపును అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు రాజకీయంగా వాడుకొంటున్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ రెండు పార్టీలకు పనీపాట లేదని.. అందువల్లే ఈ తరహా ఆరోపణలు చేస్తున్నాయంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దయచేసి ఆ యా పార్టీల నేతల మాటలు విని మోసపోవద్దంటూ ప్రజలకు స్పష్టం చేశారు.

మిగతా 3 లో




# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు ప్రత్యేక కమిటీ

## డాక్టర్ కేశవరావు చైర్మన్‌గా నియామకం

### ఉద్యమ త్యాగాలు, సేవలకు గుర్తింపు కల్పించనున్న ప్రభుత్వం



**హైదరాబాద్, మే 15:** తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల సేవలు, త్యాగాలను అధికారికంగా గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆదేశాల మే-రకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తూ సాధారణ పరిపాలన శాఖ శుక్రవారం జీఓ ఆర్టీ నం.679 జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రాణత్యాగాలు చేసినవారు, శారీరక వైకల్యానికి గురైనవారు, జైలు జీవితం గడిపినవారు, వివిధ రూపాల్లో ఉద్యమంలో పాల్గొన్నవారిని గుర్తించి వారికి గౌరవం కల్పించాలనే డిమాండ్ చాలా కాలంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె. కేశవరావును కమిటీ చైర్మన్‌గా నియమించారు. సభ్యులుగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్సీ విప్ అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి నియమితులయ్యారు. సాధారణ పరిపాలన శాఖ పొలిటికల్ సెక్రటరీ కమిటీ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు అనుసరించాల్సిన స్పష్టమైన ప్రమాణాలను రూపొందించడం కమిటీ ప్రధాన బాధ్యతగా ప్రభుత్వం పేర్కొంది. ఆ ప్రమాణాల ఆధారంగా ఉద్యమకారుల జాబితాను సిద్ధం చేసి, వారికి ఇవ్వాల్సిన గుర్తింపు, గౌరవం, సౌకర్యాలపై ప్రభుత్వానికి సిఫారసులు చేయనుంది. అవసరమైతే కమిటీ వివిధ శాఖల అధికారులను పిలిపించుకుని సమాచారం సేకరించవచ్చు. సమావేశాలు నిర్వహించవచ్చు. ఇతర నిపుణులు, వ్యక్తులను కూడా సంప్రదించవచ్చు. కమిటీ తన నివేదికను వీలైనంత త్వరగా ప్రభుత్వానికి సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కమిటీ పనితీరుకు అవసరమైన సహకారం అందించాలని అన్ని శాఖల కార్యదర్శులు, అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# బండి భగీరథ పోక్సో కేసులో సోషల్ మీడియాలపై కేసులు

### బాలల సంక్షేమ కమిటీ ఫిర్యాదుతో రంగంలోకి పోలీసులు

**హైదరాబాద్, మే 16:** బండి భగీరథ్ పోక్సో కేసులో బాధిత బాలిక, ఆమె కుటుంబ సభ్యుల వివరాలను బహిర్గతం చేసిన సోషల్ మీడియా నిర్వాహకులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. బాధితురాలి ఫోటోలు, వీడియోలు, ఆమె తల్లిదండ్రుల వివరాలను వైరల్ చేసిన పలు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ ఛానళ్లపై చర్యలు తీసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బాధిత కుటుంబం వివరాలు బహిర్గతమయ్యేలా సోషల్ మీడియాలో పోస్టులు ప్రసారం కావడంపై మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ తీవ్రంగా స్పందించారు. బాధితురాలి గోప్యతను దెబ్బతీస్తూ ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిబంధనలను ఉల్లంఘించిన పలు సోషల్ మీడియా ఖాతాలను పోలీసులు ఇప్పటికే గుర్తించారు. వాటికి సంబంధించిన యుఆర్‌ఎల్ లను సేకరించి ఉన్నతాధికారులు, సంబంధిత సంస్థలకు పంపించారు. ఈ ఖాతాలను నిర్వహిస్తున్న వ్యక్తులను గుర్తించే ప్రక్రియ వేగవంతమైంది. పోక్సో చట్టం ప్రకారం బాధితుల వివరాలను బయటపెట్టడం తీవ్రమైన నేరమని, ఇలాంటి పోస్టులను షేర్ చేసినా లేదా ప్రసారం చేసినా శిక్ష తప్పదని పోలీసులు స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా బాధిత బాలిక వ్యక్తిగత సమాచారాన్ని వైరల్ చేస్తున్న వారిపై నిఘా ఉంచామని, చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. బాధితురాలి భవిష్యత్తు, భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వారు కోరారు.

# క్యాన్సర్‌పై 'అట్లాస్' విడుదల

### సీఎం రేవంత్‌కు నివేదిక అందజేసిన నోరి దత్తాత్రేయుడు

**హైదరాబాద్, మే 15 :** తెలంగాణలో క్యాన్సర్ వ్యాధి వ్యాప్తి, ప్రభావంపై సమగ్ర సమాచారంతో రూపొందించిన 'క్యాన్సర్ అట్లాస్ ఆఫ్ తెలంగాణ' నివేదికను ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు సీఎం రేవంత్‌రెడ్డికి అందజేశారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జరిగిన కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చోంగ్తూ పాల్గొన్నారు. తెలంగాణలో క్యాన్సర్ పరిస్థితులపై సమగ్ర నివేదిక రూపొందించినందుకు డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని ముఖ్యమంత్రి అభినందించారు. క్యాన్సర్‌పై పోరాటంలో ఈ అట్లాస్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో క్యాన్సర్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, వ్యాధి వ్యాప్తికి గల కారణాలను అధ్యయనం చేయడానికి ఈ నివేదిక దోహదపడుతుందని సీఎం తెలిపారు. నివేదికలో పొందుపరిచిన డేటా ఆధారంగా అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేక స్క్రీనింగ్ సెంటర్లు ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందన్నారు. హైదరాబాద్‌కే పరిమితం కాకుండా, క్యాన్సర్ బాధితులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక ఆస్పత్రులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సీఎం వెల్లడించారు. అలాగే ఆరోగ్యశ్రీ పథకం కింద కార్పొరేట్ ఆస్పత్రుల్లో క్యాన్సర్ చికిత్సను మరింత సమర్థవంతంగా అందించాలని అధికారులకు సూచించారు.



# 2034 వరకు నేనే ముఖ్యమంత్రిని

మొదటి పేజీ తరువాయి

శుక్రవారం హైదరాబాద్ వేదికగా సీఎం మాట్లాడారు. టీడీపీలో పదేళ్లు పనిచేశానని.. సీఎం చంద్రబాబు ఇప్పటికి తనను గౌరవిస్తారని ప్రస్తావించారు. పార్టీని వదిలిపెట్టిన తర్వాత నాయకుల మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా అరుదని తెలిపారు.. పార్టీని వదిలిపెట్టే సమయంలో విజయవాడకు వెళ్లి చంద్రబాబుకు చెప్పి వచ్చానని గుర్తుచేశారు.. కాంగ్రెస్‌ను దేశంలో అధికారంలోకి తేవాలని రాహుల్ గాంధీకి లక్ష్యం ఉందని...కాని ప్రధాని కావాలన్న లక్ష్యం లేదని స్పష్ట చేశారు. వికారాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ప్రధాని పదవి తీసుకోవాలని తానే రాహుల్ గాంధీకి చెప్పి ఒప్పించానని ప్రస్తావించారు. ఇప్పుడు జనం స్విగ్గి పాలిటిక్స్ కోరుకుంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి రాహుల్ గాంధీనే



అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముందు ప్రకటించి తర్వాత ఇండియా కూటమిని ఒప్పిస్తామని తెలిపారు. ఇండియా కూటమి తరుపున ఒక పాలసీ డాక్యూమెంటును తీసుకువచ్చి ప్రజలను తీర్పు ఇవ్వమని కోరతామని అన్నారు. 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తారని చెప్పుకొచ్చారు.. 2034 వరకు తాను తెలంగాణలోనే ఉంటానని.. ఈ ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. పదిశాతం జీడీపీని తెలంగాణ దేశానికి ఇచ్చేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రినని చెప్పుకొచ్చారు. 2034 తర్వాత తాను ముఖ్యమంత్రిగా ఉండనని.. తర్వాత తరానికి అవకాశం ఇస్తానని తెలిపారు. దేశానికి కూడా సేవలందిస్తా అని.. తన అనుభవాన్ని దేశం కోసం పంచుతానని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసిన తర్వాత.. ఆయన ఏ బాధ్యతలు అప్పగించిన తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# బండి సంజయ్ కుమారుడిని అప్పగించాలి

### నైతికిత నిరూపణలకు ఇదే సమయం: రేవంత్

**హైదరాబాద్, మే 15:** పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్ పోలీసులకు దొరకకుండా పరారీలో ఉండటం సరికాదని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన నైతిక బాధ్యతను చాటుకుంటూ, తక్షణమే తన కుమారుడిని పోలీసులకు అప్పగించాలని ఆయన సూచించారు. అలా చేయడం వల్ల బండి సంజయ్ గౌరవం పెరుగుతుందని సీఎం వ్యాఖ్యానించారు. ఎలాంటి కేసులనైనా చట్టబద్ధంగా, ధైర్యంగా ఎదుర్కోవాలని.. పారిపోవడం వల్ల సమస్యలకు పరిష్కారం లభించదని సీఎం హితవు పలికారు. "తప్పయినా, ఒప్పయినా నిలబడి సమాధానం చెప్పాలి. పారిపోవడం వల్ల మరింత అప్రతిష్ట వస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. బండి సంజయ్ కింది స్థాయి నుంచి కష్టపడి పైకి ఎదిగిన నాయకుడని, అయితే తన కుమారుడి ప్రవర్తన కారణంగా ఆయనకు ఇప్పుడు తలవంపులు వచ్చాయని సీఎం వ్యాఖ్యానించారు. కేసులో ఎవరిది తప్పు, ఎవరిది ఒప్పు అనే విషయాన్ని విచారణ అధికారులు నిష్పాక్షికంగా తేలుస్తారని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విచారణకు సహకరించకుండా తప్పించుకు తిరగడం భావ్యం కాదని, తక్షణమే భగీరథ్‌ను పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని ఆయన సూచించారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, ఈ విషయంలో రాజకీయాలకు



తావులేదని సీఎం స్పష్టం చేశారు.

# బండి సంజయ్‌పై దుష్ప్రచారం ఆపండి

### సిటీ సివిల్ కోర్టు కీలక ఉత్తర్వులు

### ఆయన ప్రతిష్టను దెబ్బతీసే పోస్టులు, వీడియోలను తక్షణమే తొలగించాలి

### ఈనెల 26లోగా చర్యలు తీసుకోకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక

**హైదరాబాద్, మే 16:** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని సాగుతున్న దుష్ప్రచారంపై హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు కీలక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. బండి భగీరథ్ పోక్సో కేసును సాకుగా చూపుతూ ఆయన ప్రతిష్టకు భంగం కలిగించేలా సామాజిక మాధ్యమాలు, ఇతర వేదికల్లో చేస్తున్న ప్రచారాన్ని తక్షణమే నిలిపివేయాలని కోర్టు ఆదేశించింది. కోర్టు ఉత్తర్వుల ప్రకారం.. బండి సంజయ్‌ను టార్గెట్ చేస్తూ




ఇప్పటివరకు సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియో క్లిప్పింగులు, డిజిటల్ కంటెంట్, పత్రికా కటింగులు, వాల్ పోస్టర్లను తక్షణం తొలగించాలని స్పష్టం చేసింది. ఈ నెల 26వ తేదీలోగా సదరు కంటెంట్‌ను తొలగించని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఇకపై ఆయన వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా ఎలాంటి అసత్య ప్రచారాలు చేసినా కఠిన చర్యలు తప్పవని న్యాయస్థానం స్పష్టం చేసింది. బండి సంజయ్ తరఫు న్యాయవాదులు కోర్టులో వాదనలు వినిపిస్తూ.. రాజకీయ ప్రత్యర్థులు ఉద్దేశపూర్వకంగా ఆయనను అప్రతిష్టపాలు చేసేందుకు సోషల్ మీడియాను వేదికగా చేసుకున్నారని ఫిర్యాదు చేశారు. తప్పుడు వీడియోలు, వార్తలను వ్యాప్తి చేస్తూ ఆయన సామాజిక, రాజకీయ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం.. ఇలాంటి చర్యలు న్యాయవ్యవస్థ దృష్టిలో తీవ్రమైనవని అభిప్రాయపడుతూ పిటిషనర్ అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చింది. భగీరథ్‌పై కేసు నమోదైన నాటి నుంచి బండి సంజయ్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలంటూ ప్రతిపక్ష పార్టీలు పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో కోర్టు ఇచ్చిన తాజా ఆదేశాలు రాజకీయ నాయకులపై వ్యక్తిగత దూషణలకు దిగేవారికి ఒక బలమైన సందేశాన్ని పంపినట్లయింది.

# న్యాయం కోసమే మా పోరాటం

- కన్నీటి పర్యంతమైన బండి భగీరథ బాధిత బాలిక తల్లి
- కుమార్తె భద్రత, గౌరవంపై ఆందోళన..
- నిందితుడిని కఠినంగా శిక్షించాలని సుదీర్ఘ లేఖ

హైదరాబాద్, మే 16: కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో బాధితురాలి తల్లి శనివారం ఒక సుదీర్ఘ లేఖను విడుదల చేశారు. తాము ఏ రకమైన ప్రచారం కోసమో లేదా రాజకీయ లబ్ధి కోసమో ఈ పోరాటం చేయడం లేదని, కేవలం తమ బిడ్డకు జరిగిన అన్యాయంపై చట్టబద్ధమైన పోరాటం చేస్తున్నామని ఆమె స్పష్టం చేశారు. మైనర్ బాలిక గుర్తింపును రహస్యంగా ఉంచుతూనే, జరిగిన దారుణాలను ఆమె ఆ లేఖలో వివరించారు. 2025లో తన కుమార్తెకు భగీరథ్‌తో పరిచయం ఏర్పడిందని, అది కాస్తా వేధింపులకు దారితీసిందని బాధితురాలి తల్లి ఆరోపించారు. 2025 డిసెంబర్ 31వ తేదీ రాత్రి మొయినాబాద్‌లో జరిగిన ఒక వేడుకలో తన కుమార్తెను మద్యం సేవించమని బలవంతం చేశాడని, ఆమె స్పృహలో లేని సమయంలో అనుచితంగా


**Press Release**

1. This statement is being issued by a helpless mother whose minor daughter is the victim in FIR No. 684/2026 registered under the Protection of Children from Sexual Offences Act, 2012. Even while carrying unbearable emotional pain, I am consciously withholding the identity of my child in obedience to the law of this country, the provisions of the POCSO Act, and the directions of the Hon'ble Supreme Court of India. My daughter deserves protection, dignity, and a future free from public humiliation.

2. We are an ordinary middle-class family. We are not politically powerful people. We are not influential people. We are parents who raised our daughter with dreams, values, education, and hope. Never in our worst nightmares did we imagine that one day we would have to stand before society begging institutions to protect our child and hear our cries for justice. This statement is not issued out of revenge or publicity. It is issued because silence has become more painful than speaking.

3. My daughter informed us that she came into contact with Mr. Bandi Bageerath during the year 2025. What began as normal interaction slowly turned into emotional dependence through constant communication, emotional assurances, repeated persuasion, and sustained personal contact. As parents, it shatters us to say this publicly, but our daughter alleges that she was emotionally manipulated, psychologically controlled, discouraged from focusing on her studies and future, and repeatedly pressured for physical involvement despite her discomfort and resistance on several occasions.

4. As a mother, no words can fully describe the pain of hearing my daughter narrate incidents that allegedly occurred at different locations including apartments, private premises, and particularly during the night of 31st December 2025 and early hours of 1st January 2026 at Moinabad. My daughter disclosed that she was allegedly pressured to consume alcohol despite resistance and later subjected to inappropriate physical conduct and coercive behaviour when she was in a vulnerable condition. Every time she recalled these incidents, we saw fear, shame, and emotional collapse in her eyes. These allegations are now under investigation and we trust the law to uncover the truth.


Page 1 of 5

ప్రవర్తించాడని పేర్కొన్నారు. ఈ ఘటన తర్వాత తన కుమార్తె తీవ్ర మానసిక వేదనకు గురైందని, అప్పటి నుంచి భగీరథ్ వాట్సాప్ చాటింగ్‌లు, ఫోన్ కాల్స్ ద్వారా తీవ్ర ఒత్తిడికి గురిచేశాడని ఆరోపించారు. తమ వద్ద ఇందుకు సంబంధించిన డిజిటల్ ఆధారాలు ఉన్నాయని వెల్లడించారు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో తాము చట్టపరంగా ముందుకెళ్లాలని ప్రయత్నించినప్పుడు, కేసు పెట్టవద్దంటూ పరోక్షంగా రాజీ ప్రయత్నాలు మరియు ఒత్తిళ్లు వచ్చాయని బాధితురాలి తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 22న బీజేపీకి చెందిన ఒక వ్యక్తి తమ ఇంటికి వచ్చాడని, ఆ తర్వాతి రోజు తాము కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కలిసినప్పుడు తమకు భరోసా ఇవ్వాల్సింది పోయి భయపెట్టారని ఆమె ఆరోపించారు. చివరికి తమపైనే ఎదురు కేసులు పెట్టి బ్లాక్‌మెయిల్ చేసే ప్రయత్నం జరిగిందని వాపోయారు. పోలీసులను ఆశ్రయించినప్పుడు కూడా మైనర్ బాలిక కేసు అయినప్పటికీ గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చిందని, చివరకు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తుపై తమకు నమ్మకం ఉందని, అయితే నిందితుడు ఇప్పటికీ స్వేచ్ఛగా తిరగడంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. తన కుమార్తె వయస్సును తక్కువ చేసి చూపేలా రికార్డులను సవరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వాటన్నింటినీ అరికట్టి న్యాయం చేయాలని కోరారు. సోషల్ మీడియా, మెయిన్ స్ట్రీమ్ మీడియా తమ వ్యక్తిగత సమాచారాన్ని, కుమార్తె గుర్తింపును బయట పెట్టవద్దని ఆమె వేడుకున్నారు. దీనివల్ల బాధితురాలు మరింత మానసిక కుంగుబాటుకు గురయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, చివరికి నిజమే గెలుస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

# గూడులేని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

గూడులేని ప్రతి అర్హ పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని విధంగా ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తూ తెలంగాణ ప్రభుత్వం పేదల గృహనిర్మాణంలో దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. తొలి విడతలో 3 లక్షలకు పైగా ఇండ్లను మంజూరు చేశామని, అందులో 2.90 లక్షల ఇండ్లకు గ్రౌండింగ్ పూర్తి కాగా ఇప్పటికే సుమారు 50 వేల గృహప్రవేశాలు జరిగాయని తెలిపారు. మరో రెండు లక్షలకు పైగా ఇండ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని, రెండు నెలల్లో పూర్తి అవుతాయని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఐటీడీఏ ప్రాంతాల నియోజకవర్గాలకు అదనపు ఇండ్లు కేటాయించినట్లు తెలిపారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కార్యక్రమాన్ని జూన్ 2న ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు.



ఇది ఇక్కడితో ఆగిపోదని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇల్లు అందే వరకు మూడో, నాలుగో విడతలుగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇందిరమ్మ పథకం కింద రూ.20 వేల వరకు సాయం పొందిన వారికి కూడా మళ్లీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. పైలట్ గ్రామాల్లో 600 చదరపు అడుగులకు పైగా నిర్మించిన ఇండ్ల బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. పేదలు నివసిస్తున్న గుడిసెల స్థానంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే సమయంలో ఫారెస్ట్ అధికారులు లేదా సింగరేణి యాజమాన్యం అడ్డంకులు కల్పించవద్దని మంత్రి సూచించారు. ఇండ్ల నిర్మాణానికి అవసరమైన మట్టిని చెరువులు, కుంటల నుంచి తరలించడంపై రెవెన్యూ, పోలీసు శాఖలు ఇబ్బందులు కలిగించకూడదన్నారు. ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ఎక్కువ అటవీ భూములు ఉండటంతో రెవెన్యూ-ఫారెస్ట్ శాఖల మధ్య సరిహద్దు వివాదాలు అధికంగా ఉన్నాయని పేర్కొన్న మంత్రి, జాయింట్ సర్వే నిర్వహించి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన రోవర్స్ సాయంతో భూ సర్వే నిర్వహించి వివాదాలకు ముగింపు పలకాలని సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు వాకిటి శ్రీహరి, సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

# జహీరాబాద్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్

- రూ.650 కోట్ల పెట్టుబడితో భారీ ఫుడ్ ఇండస్ట్రీ
- దామోదరతో కలసి ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు
- త్రీ ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం



**సంగారెడ్డి, మే 15:** తెలంగాణ రైజింగ్‌తో త్రీ ట్రిలియన్ ఎకానమీ కోసం తాము పనిచేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. జహీరాబాద్ లాంటి ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం తాము కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. శుక్రవారం కొండాపూర్ మండలం తొగర్‌పల్లిలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహలు పర్యటించారు. రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల్లో భారీ ఫుడ్ ఇండస్ట్రీకి మంత్రులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. 1500 మంది స్థానిక మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కేజేఎస్ యూనిట్‌కి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. తొగర్‌పల్లిలో ఇంత పెద్ద పరిశ్రమ రావడానికి నిర్మల జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కారణమని చెప్పుకొచ్చారు. 1500 మంది మహిళలకు ఈ పరిశ్రమతో ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈ పరిశ్రమ పూర్తిగా కాలుష్య రహితమని అన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో అంతర్జాతీయ కారిడార్‌లో ఓ ఇండస్ట్రీ నెలకొల్పుతామని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అంతర్జాతీయ సదస్సులో పాల్గొని పరిశ్రమల కోసం పెట్టుబడులను ఆకర్శిస్తున్నామని చెప్పుకొచ్చారు. స్థానిక యువతకు ఉపాధే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని తెలిపారు. రాబోయే కాలంలో 2047 నాటికి దేశ జాతీయ ఉత్పత్తిలో 10 శాతం ఉత్పత్తి పెంచేలా తాము పనిచేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే మొదట పరిశ్రమలు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఏర్పడ్డాయని మంత్రి దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. మంత్రి శ్రీధర్‌బాబుకి పరిశ్రమల శాఖ తగినవిధంగా సెట్ అవుతుందని తెలిపారు. మెదక్ ప్రజలు చాలా అదృష్టవంతులని చెప్పుకొచ్చారు. వెనుకబడ్డ ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తే ఆ ప్రాంత ప్రజలకు ఉపాధి లభిస్తుందని దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు ఈ పరిశ్రమ ఏర్పాటు కోసం సహకరించారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. 1500 మంది మహిళలకు ఈ పరిశ్రమతో ఉపాధి లభిస్తుందని అన్నారు. సంగారెడ్డి జిల్లాకు కేంద్ర సంస్థలను తీసుకువచ్చామని జగ్గారెడ్డి తెలిపారు.



## పెట్రో ధరల పెంపు అనివార్యం

**కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌వి పనీపాటలేని విమర్శలు**

**మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్, మే 15:** పెట్రోల్, డీజిల్ ధరల పెంపును అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీలు రాజకీయంగా వాడుకొంటున్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ రెండు పార్టీలకు పనీపాట లేదని.. అందువల్లే ఈ తరహా ఆరోపణలు చేస్తున్నాయంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దయచేసి ఆ యా పార్టీల నేతల మాటలు విని మోసపోవద్దంటూ ప్రజలకు స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు పెంపుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. దేశవ్యాప్తంగా పెట్రోలు ధరలు పెరిగాయన్నారు. ఈ పెంచిన ధరలు శుక్రవారం ఉదయం నుంచి అమల్లోకి వచ్చాయని చెప్పారు. అమెరికా, ఇరాన్ యుద్ధ ప్రభావంతోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు అనివార్య మైందన్నారు. అంతేకానీ ఇది ప్రజల మీద భారం వేసేందుకు కాదన్నారు. క్రూడాయిల్ దిగుమతికి భారీగా ఖర్చు అవుతుందని వివరించారు. అందుకోసమే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో అమెరికా, జర్మనీ, జపాన్ తదితర దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సోదాహరణగా వివరించారు. పెట్రోల్, డీజిల్ లీటర్ ధరలు రూ.3కు పైగా పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. వీటి ధరలు పెంచడం వల్ల ప్రజలపై అదనపు భారం పడుతుందంటూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పైవిధంగా స్పందించారు.

## ఇప్పట్లో ఎన్నికలు లేవు

**సర్ ప్రక్రియను హడావిడిగా అమలు చేయడం తగదు**

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషన్‌కు టీపీసీసీ వినతి**



**హైదరాబాద్, మే 15:** ఎస్‌ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. సర్ అంశంపై పీసీసీ బృదం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. అనంతరం మహేశ్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. ఎస్‌ఐఆర్ వల్లే బెంగాల్‌లో రాజకీయ సమీకరణలు మారాయన్నారు. గెలవాల్సిన పార్టీలు ఓడిపోయాయి. తెలంగాణలో వచ్చే రెండేళ్లలో ఎలాంటి ఎన్నికలు లేవు. ఎస్‌ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదు. ఆ పక్రియను ఏడాదిన్నరపాటు జాగ్రత్తగా చేయాలని ఇసిని కోరామని వెల్లడించారు.జనగణన పక్రియ ఇప్పటికే జరుగుతోంది. జనగణనతో పాటే ఎస్‌ఐఆర్ నిర్వహిస్తే సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుంది. ఎస్‌ఐఆర్‌లో ఓటు తొలగిస్తే దరఖాస్తు చేసుకునే గడువు 3 నెలలకు పెంచాలన్నారు. ప్రత్యక్షంగా 3-4 సార్లు బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటు తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఈసీని కలిసిన వారిలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

## కాళేశ్వర క్షేత్రంలో సరస్వతీ అంత్య పుష్కరాలు

**డిప్యూటీ సీఎం భట్టికి మంత్రి కొండా సురేఖ ఆహ్వానం**



**హైదరాబాద్, మే 15:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం వేదికగా సరస్వతీ నది అంత్య పుష్కరాలను తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ పుష్కరాలలో పాల్గొనాల్సిందిగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ప్రజా భవన్ కు ప్రత్యేకంగా వచ్చి దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ డైరెక్టర్ ఎం. హనుమంతరావు, ఇతర ఉన్నతాధికారులు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను వేదోఛ్చారణలతో ఆశీర్వదించారు. సరస్వతీ అంత్య పుష్కరాలను మే 21 నుంచి జూన్ 1 వరకు 12 రోజుల పాటు కాళేశ్వరంలో నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ సీఎంకు మంత్రి కొండా సురేఖ వివరించారు. మే 21న ఉదయం 5:43 గంటలకు తొలి పుష్కర స్నానంతో వేడుకలు ప్రారంభమవుతాయి. కంచి పీఠాధిపతి శ్రీ శంకర విజేంద్ర సరస్వతి స్వామి తొలి పుష్కర స్నానాన్ని ఆచరిస్తారని డిప్యూటీ సీఎంకు వివరించారు. త్రివేణి సంగమం వద్ద ప్రతిరోజూ గంగా హారతి నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోందని వివరించారు.

# హైదరాబాద్‌కు 'హైస్పీడ్' వెలుగులు

- ముంబై, బెంగళూరు, చెన్నైకు బుల్లెట్ రైళ్లు!
- ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎస్ రామకృష్ణారావు ఆదేశం
- తెలంగాణ రైజింగ్ 2047: ఆర్థిక వృద్ధికి ఇంజిన్‌గా మారనున్న రవాణా వ్యవస్థ



**హైదరాబాద్, మే 15:** భాగ్యనగరం వేదికగా దేశంలోని ప్రధాన నగరాలను అనుసంధానించే 'హైస్పీడ్ రైలు కారిడార్' ప్రాజెక్టులపై తెలంగాణ ప్రభుత్వం కసరత్తు వేగవంతం చేసింది. కేంద్ర రైల్వే శాఖతో సమన్వయం చేసుకుంటూ ఈ ప్రాజెక్టులకు సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ఈ ప్రాజెక్టుల పురోగతిపై చర్చించారు. హైదరాబాద్ నుండి ముంబై, బెంగళూరు మరియు చెన్నై నగరాలకు హైస్పీడ్ రైలు మార్గాలను ఏర్పాటు చేయడం ద్వారా తెలంగాణ 'రైజింగ్ 2047' ఎకనామిక్ గ్రోత్ కారిడార్‌గా అభివృద్ధి చెందుతుందని సీఎస్ పేర్కొన్నారు. ఈ మార్గానికి సంబంధించి సుమారు 671 కిలోమీటర్ల మేర డీపీఆర్ సిద్ధమైందని రైల్వే అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణలో 93 కిలోమీటర్ల మేర భూసేకరణ అవసరమవుతుంది. ఈ రెండు మార్గాలకు సంబంధించి రాష్ట్రంలో సుమారు 123 కిలోమీటర్ల నిడివిలో భూసేకరణ చేపట్టాల్సి ఉంటుందని అధికారులు వెల్లడించారు. ప్రాజెక్టు అమలులో భూసేకరణ, కనెక్టివిటీ మరియు మౌలిక వసతుల కల్పనపై అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సూచించారు. ముఖ్యంగా కోకాపేట, శంషాబాద్ ప్రాంతాలలో రైల్వే డిపోల ఏర్పాటుకు అవసరమైన భూమిని సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి హెచ్‌ఎండీఏ, జీఎంఆర్ ఎయిర్‌పోర్టు, రోడ్లు భవనాల శాఖ అధికారులు రైల్వే అధికారులతో కలిసి పనిచేయాలని స్పష్టం చేశారు. దేశంలోనే అత్యంత వేగవంతమైన ఈ రవాణా వ్యవస్థ అందుబాటులోకి వస్తే.. పారిశ్రామిక, ఐటీ మరియు పర్యాటక రంగాల్లో తెలంగాణ సరికొత్త పుంతలు తొక్కుతుందని రామకృష్ణారావు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, కేంద్ర రైల్వే శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎన్నికలు కాగానే పెట్రోల్ ధర పెంచారు

**మోడీ వైఫల్యానికి ఇది నిదర్శనం**

**మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శ**



**హైదరాబాద్, మే 15:** ఎన్నికలు పూర్తి కాగానే పెట్రోల్ ధరలు పెంచి బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలను మోసం చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశంలో నాలుగు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యే వరకు అందరూ ఊహించిన విధంగా పెట్రోల్ డీజిల్ పెంచకుండా ఆపారన్నారు. ఎన్నికలు పూర్తికాగానే ముఖ్యమంత్రుల ప్రమాణ స్వీకారం కూడా కాకముందే దేశ ప్రజలకు ముఖ్యంగా తెలంగాణ ప్రజలకు పెట్రోల్ ధరలు పెంచి మరోసారి అన్యాయం చేసిందని వెల్లడించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ పెట్రోల్ ధరలు పెరగవని చాలాసార్లు అన్నారని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచిందని గుర్తు చేశారు.గతంలో యూపీఏ ప్రభుత్వం నయా పైసా పెంచక ముందే గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోడీ అపహాస్యం చేసే విధంగా వ్యవహరిస్తుండే అని చెప్పారు. మూడు రోజుల క్రితం హైదరాబాద్ పర్యటనలో పెట్రోల్, డీజిల్ తక్కువ వాడండి బంగారం కొనవద్దు, నూనె తక్కువ వాడాలి అన్నప్పుడే నడ్డివిరుస్తారని అనుమానం వచ్చిందన్నారు. ఆరు నెలల స్టాక్ ఉందని చెప్పారు. యుద్ధం కారణం చూపుతున్నారని.. యుద్ధం ఈరోజు రాలేదు.. ఇప్పటి నుండో ఉందన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలపై కాంగ్రెస్ పార్టీ అందరం కలిసి వ్యతిరేకిస్తున్నామని.. పెట్రోల్ ధరలపై బీజేపీ నేతలు స్పందించి ముక్కు నేలకు రాయాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# భూగర్భ జలాల సంరక్షణే లక్ష్యం..

- నీటి వృథాపై ఉక్కుపాదం!
- ఫ్లోరైడ్, నైట్రేట్ సమస్యలపై ప్రత్యేక దృష్టి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- అధిక వినియోగ ప్రాంతాల్లో కొత్త బోరుబావుల తవ్వకాలపై ఆంక్షలు



హైదరాబాద్, మే 15: తెలంగాణ రాష్ట్రంలో భూగర్భ జలాల సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు తాగునీటి భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యంగా ఫ్లోరైడ్, నైట్రేట్ వంటి సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామని వెల్లడించారు. శుక్రవారం సచివాలయంలో భూగర్భ జలాల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో నీటి లభ్యత పెరుగుతున్నప్పటికీ, అదే స్థాయిలో వినియోగం కూడా పెరుగుతుండటంపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. 2024తో పోలిస్తే 2025లో భూగర్భ జలాల వినియోగం 45.93% నుండి 46.86% శాతానికి పెరిగిందని ఆయన గుర్తు చేశారు. భూగర్భ జలాల వినియోగం అధికంగా ఉన్న 16 జిల్లాల్లో భవిష్యత్ అవసరాల దృష్ట్యా కఠిన నియంత్రణలు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. రాజధాని హైదరాబాద్‌లోని ఎనిమిది మండలాలు 'అధిక వినియోగ' కేటగిరీలో ఉన్నాయని అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. భూగర్భ జలాల ఒత్తిడి ఎక్కువగా ఉన్న గ్రామాల్లో కొత్తగా బోరుబావుల తవ్వకాలు మరియు అదనపు నీటి వినియోగాన్ని నియంత్రించాలని మంత్రి ఆదేశించారు. ఈ మేరకు ఆయా గ్రామాల వివరాలను జిల్లా యంత్రాంగానికి పంపించి, పర్యవేక్షణ పెంచాలని సూచించారు. అలాగే, ఇసుక తవ్వకాల అనుమతులు ఇచ్చే ముందు భూగర్భ జలాల శాఖతో తప్పనిసరిగా సంప్రదింపులు జరపాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జల మట్టాలను నిరంతరం గుర్తించేందుకు 1,771 ఫిజోమీటర్లను వినియోగిస్తున్నట్లు మంత్రి తెలిపారు. జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు అమలులో తెలంగాణ భూగర్భ జల విభాగం ఉత్తమ పనితీరు కనబర్చడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇకపై కృత్రిమ మేధస్సు (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించి మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. భూగర్భ జలాల సంరక్షణను ఒక సామాజిక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంటల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని మంత్రి పిలుపునిచ్చారు. కాగా, పరిశ్రమలు, అపార్టుమెంట్లు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ యూనిట్లకు అనుమతులు ఇవ్వడం ద్వారా శాఖకు రూ. 25.80 కోట్ల ఆదాయం లభించిందని అధికారులు వెల్లడించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్, డైరెక్టర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 21న 'నీట్' రీ-ఎగ్జామ్ విద్యార్థులకు ఊరట

## ప్రశ్నపత్రం లీకేజీతో రద్దయిన పరీక్షకు కొత్త షెడ్యూల్ విడుదల

- గతేడాది లీక్ మాఫియాపై సీబీఐ దృష్టి
- వచ్చే ఏడాది నుంచి పూర్తిగా ఆన్‌లైన్ విధానం: కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



**న్యూఢిల్లీ, మే 15:** ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో రద్దయిన నీట్ యూజీ-2026 పరీక్షను తిరిగి నిర్వహించేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కొత్త షెడ్యూల్‌ను ఖరారు చేసింది. జూన్ 21వ తేదీ ఆదివారం ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు ఎన్‌టీఏ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. మే 3న జరిగిన పరీక్షలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు తేలడంతో, దేశవ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న సుమారు 23 లక్షల మంది విద్యార్థులు ఇప్పుడు మళ్లీ పరీక్ష రాయాల్సి ఉంది. ఈ పునర్విచారణ పరీక్ష కోసం విద్యార్థులు కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, ఎటువంటి అదనపు ఫీజు చెల్లించాల్సిన పనిలేదని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థులు తమకు నచ్చిన పరీక్షా కేంద్రాన్ని (నగరాన్ని) ఎంచుకోవడానికి వారం రోజుల పాటు గడువు ఇస్తున్నట్లు, జూన్ 14న హాల్‌టికెట్లు విడుదల చేస్తామని ఎన్‌టీఏ వెల్లడించింది. నీట్ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం కలగకుండా పారదర్శకంగా పరీక్ష నిర్వహించడమే తమ ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. లీకేజీలకు శాశ్వత పరిష్కారంగా వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్షను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. ఈ కేసు దర్యాప్తును ఇప్పటికే సీబీఐకి అప్పగించామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు వార్తలను నమ్మి విద్యార్థులు ఆందోళన చెందవద్దని, అధికారిక వెబ్‌సైట్లలో వచ్చే సమాచారాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని ఆయన సూచించారు. మరోవైపు, సీబీఐ దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. రాజస్థాన్‌లోని సికార్ కేంద్రంగా జరిగిన ఈ లీకేజీ వ్యవహారంలో గతేడాది కూడా అక్రమాలు జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. కీలక నిందితుడు వికాస్ బివాల్ కుటుంబంలోని పలువురు సభ్యులు గతేడాది లీకైన పేపర్ల సహాయంతోనే ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు సాధించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. టెన్త్, ఇంటర్ మార్కులతో పోలిస్తే నీట్‌లో అనూహ్యంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల జాబితాను సీబీఐ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. లీకైన ఒక్కో పేపర్‌ను నిందితులు సుమారు 5 లక్షల రూపాయలకు విక్రయించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. మహారాష్ట్రలోని నాసిక్ నుంచి ప్రారంభమైన ఈ లీకేజీ నెట్‌వర్క్ హరియాణా, జమ్మూకశ్మీర్, కేరళ వంటి పలు రాష్ట్రాలకు విస్తరించినట్లు సమాచారం.



సంపాదకీయం

# ప్రపంచానికి 'ట్రంప్' సెగ

- అస్తవ్యస్తంగా ఆర్థిక రంగం!
- భగ్గుమంటున్న ఇంధన ధరలు
- సామాన్యుడిపై భారాల మోత
- ఐటీలో లేఆఫ్స్ కల్లోలం..
- ఒరాకిల్, సిస్కో సంస్థల్లో వేలాది మంది ఇంటికి



**ఇరాన్‌పై దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను మరింత పెంచిన అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌చర్యలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. యుద్ధ భయాలు, చమురు రవాణా అంతరాయం, ముడి చమురు ధరల పెరుగుదలతో భారత్ వంటి దిగుమతులపై ఆధారపడిన దేశాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.**

భారత్‌లో ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. ఈ ప్రభావం కేవలం ఇంధన రంగానికే పరిమితం కాకుండా అన్ని రంగాలపై పడనుంది. రవాణా ఖర్చులు పెరగడంతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా ఆకాశాన్ని అంటనున్నాయి. విమానయాన రంగం ఇప్పటికే భారమైన పరిస్థితుల్లో ఉండగా, తాజా సంక్షోభంతో మరింత కుదేలయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

**ఇంధన పొదుపు కోసం ప్రధాని నరేంద్ర మోదీ వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని ప్రోత్సహించాలని సూచించారు. హైదరాబాద్ వంటి ఐటీ నగరాల్లో దీని వల్ల భారీ స్థాయిలో ఇంధన ఆదా సాధ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో సుమారు 9 లక్షల మంది ఐటీ ఉద్యోగులు పనిచేస్తుండగా, వారిలో కనీసం సగం మంది వారానికి మూడు రోజులు ఇంటి నుంచే పనిచేస్తే నెలకు సుమారు రూ.140 కోట్ల విలువైన ఇంధనం ఆదా అయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.**

అయితే, కరోనా సమయంలో అమలైన వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని ఇప్పుడు పూర్తిస్థాయిలో కొనసాగించేందుకు అనేక ఐటీ సంస్థలు ఆసక్తి చూపడం లేదు. ఉత్పాదకత తగ్గిపోతుందనే ఆందోళనతో కొన్ని కంపెనీలు కార్యాలయ హాజరుపై మళ్లీ దృష్టి పెడుతున్నాయి.

**ఇక ఆర్థిక ఒత్తిడితో ఐటీ రంగంలో ఉద్యోగ కోతలు కూడా మొదలయ్యాయి. ఒరాకిల్ గత నెలలో ప్రపంచవ్యాప్తంగా వేలాది ఉద్యోగులను తొలగించిన తర్వాత, ఇప్పుడు ఐఐటీలు, ఎన్ఐటీల విద్యార్థులకు ఇచ్చిన జాబ్ ఆఫర్‌లను కూడా రద్దు చేసింది. సిస్కో కూడా భారీ స్థాయిలో ఉద్యోగులను తగ్గించేందుకు సిద్ధమైంది. లింక్డ్‌ఇన్‌కూడా సిబ్బంది పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఉద్యోగ కోతల దిశగా అడుగులు వేస్తోంది.**

ఇదిలా ఉండగా, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కేంద్రం నుంచి వస్తున్న సంకేతాలు ప్రజల్లో మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరి "పెట్రో ధరలు పెరగవని చెప్పలేను" అని వ్యాఖ్యానించగా, ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా కూడా అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా ధరల పెంపు తప్పదని సూచించారు.

**నిపుణుల అభిప్రాయం ప్రకారం, కేవలం కాన్వాయ్‌లలో కార్లు తగ్గించడం వల్ల పరిస్థితి మారదు. ప్రజాప్రతినిధుల దుబారా ఖర్చులు, భారీ భత్యాలు, విదేశీ పర్యటనలు, విలాసవంతమైన ఖర్చులపై కూడా నియంత్రణ అవసరమని వారు సూచిస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలంటే ఇంధన పొదుపుతో పాటు చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, వ్యవసాయ రంగానికి బలమైన మద్దతు అవసరమని అభిప్రాయపడుతున్నారు.**



# తమిళనాడులో 'విదేశీ' ఓట్లు

- ఇమ్మిగ్రేషన్ అధికారుల దర్యాప్తులో వెల్లడి.. పది మంది అరెస్ట్
- చూపుడు వేలిపై ఇంకు గుర్తుతో దొరికిపోయిన వైనం..
- ఓటర్ల జాబితా తయారీపై వెల్లువెత్తుతున్న విమర్శలు



**చెన్నై, మే 15:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విదేశీయులు ఓటు హక్కు వినియోగించుకోవడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ఎన్నికల అధికారుల కళ్లు గప్పి విదేశీ పౌరులు ఓటింగ్ లో పాల్గొన్న వైనాన్ని ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు పది మందిని అరెస్ట్ చేయగా, వీరిలో అధిక శాతం శ్రీలంకకు చెందిన వారే ఉండటం గమనార్హం. ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత, భారత్ నుంచి విదేశాలకు వెళ్తున్న కొందరు ప్రయాణికుల చూపుడు వేలుపై 'ఓటింగ్ ఇంకు' గుర్తు ఉండటాన్ని చెన్నై, మధురై విమానాశ్రయాల్లోని ఇమ్మిగ్రేషన్ అధికారులు గమనించారు. విదేశీ వీసాలు, పాస్‌పోర్టులు కలిగి ఉండి కూడా భారత ఎన్నికల్లో ఎలా ఓటు వేశారనే అనుమానంతో వారిని ప్రశ్నించగా, తాము ఓటు వేసినట్లు అంగీకరించారు. దీంతో గత మంగళవారం (మే 12) నుంచి వరుస అరెస్టులు మొదలయ్యాయి. అరెస్టయిన పది మందిలో శ్రీలంకకు చెందిన రంజిని (59), సర్ఫుదీన్ (68), నీలాంతి (44), జయంతన్ (40) వంటి వారితో పాటు బ్రిటన్‌కు చెందిన అయ్యదురై (53), ఇండోనేషియాకు చెందిన టిటిన్ మరియాట్టి (47), కెనడా పౌరుడు జితేంద్రనాథ్ (38) ఉన్నారు. విదేశీ పౌరులైన వీరికి కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా ఓటరు గుర్తింపు కార్డులు జారీ చేయడం గమనార్హం. ఇది చట్టవిరుద్ధమని పేర్కొన్న అధికారులు, ఈ కార్డులు జారీ చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### సర్వే ప్రక్రియపై ప్రశ్నలు

ఇటీవలే ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక తనిఖీల ద్వారా తమిళనాడులో సుమారు 74 లక్షల బోగస్ ఓట్లను తొలగించి, 28 లక్షల కొత్త ఓటర్లను చేర్చారు. ఇంత పెద్ద ఎత్తున సర్వే జరిగినప్పటికీ, విదేశీయుల పేర్లు ఓటరు జాబితాలో ఎలా కొనసాగుతున్నాయని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఓటర్ల జాబితా ప్రక్షాళన సరిగ్గా జరగలేదని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. విదేశీయుల ఓటింగ్ అంశం ఇప్పుడు తమిళనాడు రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ఆర్జీ కర్ హత్యాచారం కేసులో ముగ్గురు ఐపీఎస్‌ల సస్పెన్షన్

**కోల్‌కతా:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో అత్యాచారం, హత్య కేసులో విధినిర్వహణల్లో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు అధికారులపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆ ముగ్గురినీ సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. వీరిలో అప్పటి కోల్‌కతా పోలీస్ కమిషనర్ వినీత్ గోయెల్, అభిషేక్ గుప్తా, మనోజ్ ముఖోపాధ్యాయ్ ఉన్నారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో ఈ ఘటనను బీజేపీ ప్రధానంగా ఆర్జీ కర్ బాధితురాలికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చింది. బాధితురాలి తల్లికి రత్న దేబ్‌నాథ్‌కు పానిహతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టికెట్ కూడా ఇచ్చింది. ఆ నియోజకవర్గం నుంచి టీఎంసీ అభ్యర్థి తీర్థంకర్ ఘోష్‌పై రత్న దేబ్‌నాథ్ 28,836 ఓట్ల భారీ ఆధిక్యంతో గెలుపొందారు.





# పెట్రో, డీజిల్ ధరల పెరుగుదల

## లీటర్‌పై కనీసంగా రూ.3 పెంపు

### ధరలు పెంచుతూ ఆయిల్ కంపెనీల నిర్ణయం

**న్యూఢిల్లీ, మే 15:** ఊహించినట్లుగానే.. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటరు పెట్రోల్‌పై సగటున రూ.3, డీజిల్‌పై రూ.3 పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న సంక్షోభం నేపథ్యంలో.. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగాయి. అయినప్పటికీ.. ప్రభుత్వరంగ చమరు కంపెనీలు దాదాపు 11 వారాల పాటు ఇంధన ధరలను స్థిరంగా ఉంచాయి. అయితే, అవి తీవ్ర ఆర్థికఒత్తిళ్లు ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. లీటరుకు రూ.3 పెంచి వాహనదారులపై కొంత భారాన్ని మోపాయి. 2022 ఏప్రిల్ నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు దాదాపు మారలేదు. అయితే, లోక్‌సభ ఎన్నికలకు ముందు 2024 మార్చిలో లీటరుకు రూ.2 చొప్పున తగ్గించాయి. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన ధరలు పెరుగుతాయంటూ ఇటీవల పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయితే, సరిపడా నిల్వలు ఉన్నాయంటూ కేంద్రం వాటిని ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతూ వచ్చింది. ఈ క్రమంలో ధరలు పెంచడం గమనార్హం. కాగా.. ఈ ప్రకటనలకు ముందే ఇంధన ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందనే వార్తలు దేశంలోని వాహనదారులను ఆందోళనకు గురిచేశాయి. దీంతో పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరారు. ఈ క్రమంలో కొన్ని బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. సీఎన్‌జీ వాహనదారులకు కూడా గ్యాస్ కంపెనీలు షాకిచ్చాయి. కిలో సీఎన్‌జీని రూ.2 చొప్పున పెంచాయి. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ3.29, డీజిల్‌పై రూ.3.14, తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ఆయిల్ కంపెనీలు పెంచాయి. పెట్రోల్ ధరలు: ఢిల్లీలో రూ.97.77, కోల్‌కతాలో 108.74, ముంబయిలో 106.68, చెన్నైలో 103.67 (2.83)గా ఉండనున్నాయి. ఇక డీజిల్ ధరలు: ఢిల్లీలో 90.67, కోల్‌కతాలో 95.13, ముంబయి 93.14, చెన్నైలో 95.25గా ఉండనున్నాయి. దాంతో దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో వీటి ధరలు మారాయి. పశ్చిమాసియాలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచంలో ముడి చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచాలని ఆయిలు కంపెనీలు నిర్ణయించాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్‌పై రూ.3.14పై పెంచాయి. తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ధరలు పెంచాయి.

# ఆ స్థలం ఆలయానిదే!

- భోజ్‌శాల వివాదంలో ఇండోర్ కోర్టు తీర్పు
- సరస్వతీ దేవి విగ్రహ ఏర్పాటుకు అనుమతి
- మసీదుకు ప్రత్యామ్నాయ స్థలం చూసుకోవాలని సూచన

ఇండోర్, మే 15: దశాబ్దాలుగా నలుగుతున్న మధ్యప్రదేశ్‌లోని ధార్ 'భోజ్‌శాల' వివాదానికి తెరదించుతూ ఇండోర్ కోర్టు శుక్రవారం సంచలన తీర్పునిచ్చింది. వివాదాస్పదంగా మారిన ఆ స్మారక కట్టడం హిందూ దేవాలయమేనని హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. అక్కడ తిరిగి వాగ్దేవి (సరస్వతి) విగ్రహాన్ని ఏర్పాటు చేసుకునేందుకు హిందూ వర్గాలకు అనుమతినిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 2024లో భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) సుమారు 98 రోజుల పాటు ఈ ప్రాంగణంలో శాస్త్రీయ సర్వే నిర్వహించింది. దీనికి సంబంధించిన నివేదికను జూలై 15, 2024న కోర్టుకు సమర్పించింది. ఆ నివేదికలోని ఆధారాలను, చారిత్రక వాస్తవాలను పరిశీలించిన ధర్మాసనం.. అది ప్రాచీన సరస్వతీ క్షేత్రమేనని నిర్ధారించింది. ఈ నేపథ్యంలో, మొత్తం ఆలయ ప్రాంతాన్ని పురావస్తు శాఖ తన ఆధీనంలోకి తీసుకుని పర్యవేక్షించాలని కోర్టు ఆదేశించింది. హిందువులు వాగ్దేవి ఆలయంగా, ముస్లింలు కమల్ మౌలా మసీదుగా భావించే ఈ ప్రదేశంలో 2003 నాటి ఒప్పందం ప్రకారం ఇరు వర్గాలు వేర్వేరు రోజుల్లో ప్రార్థనలు చేసుకుంటున్నాయి. అయితే, తాజా తీర్పుతో ఆ నిబంధనలకు తెరపడింది. సదరు స్థలం ఆలయానికి చెందినదని తేల్చిన కోర్టు.. ముస్లిం వర్గం మసీదు కోసం ప్రత్యామ్నాయ స్థలాన్ని కోరుతూ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సుదీర్ఘ న్యాయపోరాటంలో ఇండోర్ బెంచ్ ఇచ్చిన ఈ తీర్పు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.



# భోరజ్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా బత్తుల శ్రీనివాస్



**ఆదిలాబాద్:** భోరజ్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన బత్తుల శ్రీనివాస్ను మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు గండ్రత్ సుజాత శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గండ్రత్ సుజాత మాట్లాడుతూ పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే నాయకులకు కాంగ్రెస్ పార్టీలో ఎల్లప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. బత్తుల శ్రీనివాస్ నాయకత్వంలో భోరజ్ మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ సిద్ధాంతాలను గ్రామీణ స్థాయికి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. నూతన అధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లకు సన్మానం



**భీంపూర్:** ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి, వైస్ చైర్మన్ తన్వీర్ పటేల్ ను భీంపూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, పిప్పల్‌కోటి సర్పంచ్ దాసరి రమేష్ నేతృత్వంలో మండల కాంగ్రెస్ నాయకులు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్ మాట్లాడుతూ జిల్లాలో కీలకమైన ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ బాధ్యతలను సమర్థులైన నాయకులకు అప్పగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నూతన పాలక మండలి ఆధ్వర్యంలో రైతులకు మెరుగైన సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రైతులకు నిజమైన సంక్షేమం చేరువవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అర్లి(టి) సర్పంచ్ కామన్ అశోక్, మండల కన్వీనర్ దండే సుదర్శన్, బెల్సరీ రాంపూర్ సర్పంచ్ కేశవ్, భీంపూర్ సర్పంచ్ రవీందర్, అందర్బంద్ సర్పంచ్ సీతారామ్, అన్ను పటేల్, మాజీ సర్పంచ్ కృష్ణ యాదవ్, గోన ఉప సర్పంచ్ ముషరాన్ అహ్మద్, రేణికుంట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు సిసి కెమెరా లు కీలకం

**బెజ్జంకి ఎస్సై తిరుపతి**



**బెజ్జంకి :**

సిద్దిపేట కమిషనర్ ఆఫ్ పోలీస్ రష్మీ పెరుమాల్ చేపట్టిన "సురక్షా నేత్ర" కార్యక్రమంలో భాగంగా వడ్లూర్,తోటపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బెజ్జంకి ఎస్సై తోట తిరుపతి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్సై తిరుపతి మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని, నేరాల నియంత్రణ కు సిసి కెమెరాలు దోహదపడతాయని తెలిపారు."ఒక్క కెమెరా 100 మంది పోలీసులతో సమానం."సీసీ కెమెరాలు ఉండటం వల్ల నేరాలను త్వరితగతిన గుర్తించడం, నిందితులను సులభంగా గుర్తించడం, అలాగే నేరాల నివారణలో ఎంతో సహాయపడుతుందని తెలిపారు. గ్రామ ప్రజలు కూడా కెమెరాల సంరక్షణలో పోలీసులకు సహకరించాలని కోరారు.అలాగే యువత డ్రగ్స్ జోలికి వెళ్లవద్దని సూచిస్తూ, మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా సమాజంలో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తాయని హెచ్చరించారు.కెమెరాల ఏర్పాటుకు సహకరించిన గ్రామ పెద్దలు, దాతలు మరియు గ్రామ ప్రజలకు, అలాగే వడ్లూర్ మరియు తోటపల్లి గ్రామ సర్పంచులకు బెజ్జంకి ఎస్సై ప్రత్యేక అభినందనలు తెలిపారు."సురక్షా నేత్ర" కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు అభినందిస్తూ, గ్రామాలను సురక్షితంగా మార్చేందుకు పోలీసులకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

# గ్రంథాలయాలను యువత సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ కె. హరిత**



**ఆసిఫాబాద్ :** గ్రంథాలయాలు అపారమైన విజ్ఞాన భాండాగారాలని, వీటిని యువత సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన విద్యా వారోత్సవాలు, గ్రంథాలయ దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ కామడే అనిల్, ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వర్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి లలితతో కలిసి ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా కేవలం ఉద్యోగ, ఉపాధి మార్గాలే కాకుండా జ్ఞాన వికాసంతో పాటు మానసిక ప్రశాంతతను, మధురానుభూతిని పొందవచ్చని పేర్కొన్నారు. నేటి యువత తప్పనిసరిగా గ్రంథాలయాలకు రావాలని, అక్కడ అందుబాటులో ఉన్న నవలలు, చరిత్ర పుస్తకాలు, గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలను చదివి స్ఫూర్తి పొందాలని సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగాల కోసం సన్నద్ధమయ్యే అభ్యర్థులకు గ్రంథాలయాలు ఒక అద్భుతమైన వేదికని, ఇక్కడ ఉన్న వనరులను వాడుకుని లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఆమె కోరారు. అనంతరం ఈ గ్రంథాలయంలో చదువుకుని వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను, అలాగే స్థానిక కవులను కలెక్టర్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా బిన్ అహ్మద్, కౌన్సిలర్లు, జిల్లా గ్రంథాలయ శాఖ అధికారులు, పాఠకులు, కవులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విపత్తులపై 'అప్రమత్తం'

- వర్షా కాలం..
  అధికారులకు జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం




**ఆసిఫాబాద్ టౌన్ :** రానున్న వర్షాకాలంలో ప్రకృతి విపత్తులు, వరదల వల్ల ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ప్రభుత్వ యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు న్యూఢిల్లీ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, కాగజ్‌నగర్ డివిజన్ అటవీ అధికారి అప్పయ్యతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరదలు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అధికారులు అప్రమత్తంగా ఉండి ఆస్తి, ప్రాణ నష్టాన్ని నివారించాలని సూచించారు. భారీ వర్షాల సమయంలో జనజీవనం స్తంభించిపోయే అవకాశం ఉన్నందున, ప్రజలను రక్షించి వారికి తక్షణమే పునరావాసం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో విపత్తులు సంభవించినప్పుడు సహాయక చర్యలు చేపట్టడానికి రెస్క్యూ బృందాలు సిద్ధంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి అవసరమైన ఆహారం, తాగునీరు, వైద్య చికిత్సలు అందించాలని స్పష్టం చేశారు. అగ్ని ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్, అగ్నిమాపక, నీటిపారుదల శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



**నేరడిగొండ:** డిజిటల్ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నేరడిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శబాన తరన్నం అన్నారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఐదవ రోజు శుక్రవారం కళాశాలలో విద్యా వనరులు– డిజిటల్ సేవలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయం విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయాలు కేవలం పుస్తకాల నిలయాలు కాకుండా జ్ఞానభాండాగారాలని, సమాజానికి జ్ఞానహృదయాలని పేర్కొన్నారు. పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని సంపాదించిన ఎందరో మహానుభావులు, మేధావులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని గుర్తుచేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. డిజిటల్ కాటలాగ్, ఈ–వనరులు, ఆన్లైన్ లెర్నింగ్ విధానాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల లైబ్రేరియన్ గంగాధర్, అధ్యాపకులు మమత, ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు ఐటీడీఏ పీఓతో ఆదివాసీల పరిచయ సమావేశం




**నేరడిగొండ:** ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారితో ఆదివాసీ సంఘాల ప్రతినిధుల పరిచయ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు సంఘాల నాయకులు తెలిపారు. ఉట్నూర్లోని కేబీ కాంప్లెక్స్ పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కానుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నూతనంగా ఎన్నికైన ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొని ఐటీడీఏ పీఓను మర్యాదపూర్వకంగా కలవనున్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో నెలకొన్న పలు ప్రధాన సమస్యలను పీఓ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు సంఘాల నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు తొడసం అమృతరావు, రాష్ట్ర అధ్యక్షులు మెస్రం దుర్గు, జిల్లా సలహాదారు మాడవి ఆనంద్రావు, జిల్లా అధ్యక్షులు సెడ్మకి రామారావు, లఖంపూర్ సర్మేడి ఆత్రం గంగారాం, ఆత్రం సుంగు, సోనేరావు, ఐశ్రు గంగాధర్ తదితర ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పాల్గొననున్నారు. ఆదివాసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ప్రతినిధులు కోరారు.

# కాంగ్రెస్ మండల అధ్యక్షుడికి సర్పంచ్ సన్మానం

- కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యంగా
  పనిచేయాలని పిలుపు



**గుడిహత్నూర్:** గుడిహత్నూర్ మండల నూతన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన తొడసం దౌలత్ రావును మహిళా కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, మండల కేంద్ర సర్పంచ్ ఆడే శీల శుక్రవారం ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో దౌలత్ రావుకు శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను మండలంలోని ప్రతి ఇంటికీ చేరవేయడంలో పార్టీ కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. నూతన అధ్యక్షుడు దౌలత్ రావు నాయకత్వంలో గుడిహత్నూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తన సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీలో సముచిత గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. నూతన మండల అధ్యక్షుడు తొడసం దౌలత్ రావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానం నాయకులు నరేష్ జాదవ్, ఆడే గజేందర్, సర్పంచ్ ఆడే శీలతో పాటు కాంగ్రెస్ శ్రేణులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ నాగనాథ్ లామ్దాడే, బాలాజీ పటేల్, అంకతి రవి, మాజీ ఎంపీటీసీ మన్నూర్ షిండే అశోక్, బ్రహ్మానంద్ కరాడ్, ఉప సర్పంచ్ ఎం.గణపతి, కాత్లె రాందాస్, ఆరీఫ్ ఖాన్, యువ కాంగ్రెస్ నాయకులు ఆడే జైపాల్, కె.పిరాజీ, పి.రామ్ ప్రకాష్, కె.రామ్ కిషన్, పి.విష్ణు, ఎం.మారుతి, రాథోడ్ రమేష్, కాత్లే భరత్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి మీదకు వాలిన విద్యుత్ స్తంభం

- **భయాందోళనలో కుటుంబం**
- **ఫిర్యాదు చేసినా స్పందించని విద్యుత్ శాఖ అధికారులు**



**సత్తుపల్లి:** వేంసూర్ మండలంలోని వెంకటాపురం గ్రామం బీసీ కాలనీ 3వ వీధిలో ప్రమాదకర పరిస్థితి నెలకొంది. గ్రామానికి చెందిన సాంబారు భావన ఋషి ఇంటిముందు ఉన్న విద్యుత్ స్తంభం ఇంటి పైకప్పు వైపు వాలిపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనల మధ్య జీవిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే ఆందోళనతో రాత్రింబవళ్లు గడుపుతున్నామని బాధిత కుటుంబం వాపోతోంది. స్థానికుల వివరాల ప్రకారం.. కొంతకాలంగా విద్యుత్ స్తంభం క్రమంగా వంగిపోతూ ఇంటి వైపు ఒరిగి పడిపోయే స్థితికి చేరుకుంది. ఇటీవల కురిసిన వర్షాలు, బలమైన గాలుల ప్రభావంతో స్తంభం మరింత ప్రమాదకరంగా మారిందని తెలిపారు. ఇంట్లో చిన్నపిల్లలు ఉండటంతో కుటుంబ సభ్యుల్లో భయం మరింత పెరిగిందన్నారు. ఈ సమస్యపై గ్రామ లైన్మెన్కు పలుమార్లు సమాచారం ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితుడు సాంబారు భావన ఋషి ఆవేదన వ్యక్తం చేశాడు. అనంతరం మండల విద్యుత్ శాఖ కార్యాలయానికి వెళ్లి ఏఈ దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లినా ఇప్పటివరకు స్పందన రాలేదని తెలిపారు. "ఇంటి ముందు ఉన్న స్తంభం పూర్తిగా వాలిపోయి ఉంది. ఎప్పుడు విరిగి పడిపోతుందో తెలియని పరిస్థితి. మా కుటుంబం ప్రాణభయంతో జీవిస్తోంది. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు" అంటూ బాధితుడు వాపోయాడు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై గ్రామస్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకరంగా మారిన స్తంభాన్ని వెంటనే తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు ఇంకా ఆలస్యం చేస్తే పెద్ద ప్రమాదం జరిగే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. లేదంటే గ్రామస్థులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేయొద్దు

- **వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో రాస్తారోకో**

**ఆదిలాబాద్:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జాతీయ ఉపాధిహామీ పథకానికి నిధుల కోత విధిస్తూ పేదల జీవనోపాధిని దెబ్బతీసే ప్రయత్నం చేస్తోందని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. ఉపాధిహామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం అప్రజాస్వామిక చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ ఉపాధిహామీ పథకాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్గూడ రహదారిపై ఉపాధి కూలీలతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ ఆందోళన కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి హాజరై తమ పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ పేరు దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని, పథకం నుంచి ఆయన పేరును ఎవరూ తొలగించలేరని పేర్కొన్నారు. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ పేదల ఆర్థిక భద్రత కోసం ఈ ప్రతిష్టాత్మక పథకాన్ని ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. ఏడాదికి వంద రోజుల ఉపాధి కల్పిస్తూ కోట్లాది కుటుంబాలకు ఈ పథకం అండగా నిలిచిందన్నారు. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధిహామీ పథకానికి క్రమంగా నిధులు తగ్గిస్తున్నారని ఆరోపించారు. పథకం అమలు బాధ్యతల నుంచి కేంద్రం తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని, దీంతో గ్రామీణ కూలీల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే కుట్రలకు పాల్పడుతోందని, మనుస్మృతిని అమలు చేయాలనే ప్రయత్నాలు సాగుతున్నాయని ఆరోపించారు. లౌకిక భారత దేశంలో మోదీ, అమిత్ షాల రాజకీయాలు సాగవని, రానున్న ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ రాస్తారోకో కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామీణ ఉపాధి కూలీలు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే సత్తుపల్లి ప్రథమ స్థానం

- **హౌసింగ్ పనుల్లో శరవేగ పురోగతి**
- **ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్కు ప్రశంసలు**




**సత్తుపల్లి:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఇందిరమ్మ ఇళ్లు'పథకంలో ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం రాష్ట్రంలోనే ప్రథమ స్థానం సాధించింది. హైదరాబాద్లోని గృహ నిర్మాణ శాఖ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి ఈ విషయాన్ని వెల్లడించారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయడంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కీలకపాత్ర పోషించారని అధికారులు పేర్కొన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ, పనులను సమన్వయం చేయడంతోనే ఈ ఘనత సాధ్యమైందని తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 3,433 ఇళ్లు మంజూరు కాగా, అందులో 98 శాతం మంజూరు ప్రక్రియ పూర్తయింది. ఇప్పటికే 3,267 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమై 93.3 శాతం పురోగతి నమోదైంది. ఇప్పటివరకు 1,503 ఇళ్లు పూర్తికాగా, ఇందుకోసం రూ.99.93 కోట్లు వ్యయం చేసినట్లు అధికారులు వివరించారు. అదేవిధంగా నియోజకవర్గంలో చేపట్టిన 1,229 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో 1,160 ఇళ్లు పూర్తి కాగా, 95.72 శాతం గృహ ప్రవేశాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ సమన్వయంతో సత్తుపల్లి నియోజకవర్గంలో హౌసింగ్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాలకు సత్తుపల్లి ఆదర్శంగా నిలుస్తోందని ప్రశంసించారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యేకు ప్రజలు అభినందనలు తెలియజేస్తున్నారు.

# బోరంచు శ్రీకాంత్ రెడ్డికి ఘన సన్మానం



**ఆదిలాబాద్:** తెలంగాణ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను ఘనంగా సన్మానించారు. గురువారం రాత్రి స్థానిక ప్రజాభవన్లో ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డిని శ్రీకాంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్ రెడ్డి శాలువాతో శ్రీకాంత్ రెడ్డిని సత్కరించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. నంతరం శ్రీకాంత్ రెడ్డి కూడా కంది శ్రీనివాస్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రైతు కుటుంబం నుంచి వచ్చిన శ్రీకాంత్ రెడ్డికి రైతాంగ సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రైతుల సంక్షేమం కోసం ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం అహర్నిశలు శ్రమించిన నాయకుడికి మార్కెట్ కమిటీ చైర్మన్ బాధ్యతలు దక్కడం ఆనందంగా ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రైతుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మార్కెట్ కమిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పుస్తక పఠనంతోనే విజ్ఞాన శిఖరాలకు చేరవచ్చు

- **మొబైల్ వినియోగం తగ్గించి గ్రంథాలయాలకు రావాలి**
- **జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్:** పుస్తక పఠనంతోనే విజ్ఞాన శిఖరాలకు చేరవచ్చని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక' విద్యా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 'లైబ్రరీ డే' వేడుకలును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు, యువత మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించి గ్రంథాలయాలకు రావాలని సూచించారు. గ్రంథాలయాలు జ్ఞానానికి హృదయ స్పందన వంటివని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని పేర్కొన్నారు. "విద్య పేదవారి తలరాతను, రాష్ట్ర భవిష్యత్తును మారుస్తుంది" అనే నినాదాన్ని గుర్తు చేస్తూ ప్రతి విద్యార్థి పుస్తక పఠనాన్ని నిత్య అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా గ్రంథాలయాల్లో ఉన్న అపార జ్ఞాన సంపదను వినియోగించి సమాజంలో నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. గ్రంథాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనలు, బుక్ టాక్స్ పఠన కార్యక్రమాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. నిరంతరం పఠనంలో పాల్గొంటున్న ఉత్తమ పాఠకులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించి పుస్తకాలను బహుకరించారు. జిల్లాలో పఠన సంస్కృతిని మరింత బలోపేతం చేయడానికి కమ్యూనిటీ రీడింగ్ డ్రైవ్, పుస్తక విరాళాల సేకరణ వంటి కార్యక్రమాలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చివరగా "నేడు చదవండి.. రేపు నాయకులుగా ఎదగండి" అనే స్ఫూర్తిదాయక సందేశంతో విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, వివిధ శాఖల అధికారులు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.




# పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి



**వరంగల్:** దేశ వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం సామాన్య ప్రజలపై మరింత భారం మోపే చర్య అని ఎంసిపిఐ(యు) పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున విమర్శించారు. హన్మకొండలో శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన కేంద్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ముందు పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని హామీలు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు లీటర్ పెట్రోల్, డీజిల్పై రూ.3 చొప్పున పెంచడం సిగ్గుచేటని అన్నారు. రోజురోజుకు ఇంధన ధరలు పెంచడంతో సామాన్య ప్రజల జీవనం కష్టసాధ్యంగా మారుతోందన్నారు. రాష్ట్రంలో ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఇప్పటికే ఆటో డ్రైవర్లు, యజమానులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పుడు డీజిల్ ధరల పెంపుతో వారి పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. మూలిగే నక్కపై తాటిపండు పడినట్టుగా ఆటో కార్మికుల పరిస్థితి తయారైందని వాపోయారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# జర్నలిస్టుల అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుంది

**ఐజేయూ ద్వితీయ మహాసభలో మంత్రి సీతక్క**





**ములుగు:** జర్నలిస్టుల అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐజేయూ) ద్వితీయ మహాసభ ములుగు జిల్లా కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఐజేయూ ములుగు జిల్లా అధ్యక్షుడు షఫీ ఆధ్వర్యంలో స్థానిక డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు, ఇంటి స్థలాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. ద్వితీయ మహాసభ సందర్భంగా సంఘం సభ్యులకు మంత్రి సీతక్క చిరు కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ రాష్ట్ర నాయకులు, ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి, సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పరిస్థితులకు అనుగుణంగా పంటలను సాగు చేయాలి




**తాండూర్:** ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటలను ఎంపిక చేసుకుని సాగు చేయాలని కేవీకే శాస్త్రవేత్త సాధ్వి సూచించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తాండూర్ మండలం ద్వారకాపూర్ గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు సమతుల్య ఎరువుల వినియోగం, ఆధునిక సాగు పద్ధతులు, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన పంటల ఎంపికపై అవగాహన కల్పించారు. రైతులు పంటల విభిన్నీకరణ (క్రాప్ డైవర్సిఫికేషన్) వైపు దృష్టి సారించి మార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం, విలువ ఆధారిత పంటలు, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించే పద్ధతుల గురించి వివరించారు. రైతులు అడిగిన వివిధ వ్యవసాయ సంబంధిత ప్రశ్నలకు శాస్త్రవేత్తలు సమాధానాలు ఇస్తూ ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మసాడి తిరుపతి, ఉప సర్పంచ్ మిట్ట దుర్గ, తాండూర్ మండల వ్యవసాయ అధికారి సుష్మ, బెల్లంపల్లి ఉద్యానవన అధికారి అర్చన, ఏఈఓ శంకర్, పంచాయతీ కార్యదర్శి, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

చురకలు



## అర్హులకే సంక్షేమ పథకాలు అందించాలి

**ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు కాంగ్రెస్ నేతల వినతి**



**బేల:** ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించే ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలని బేల మండల కాంగ్రెస్ నాయకులు కోరారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతంను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ఆయనతో సుదీర్ఘంగా చర్చించారు. దళారీ వ్యవస్థకు తావులేకుండా అర్హులైన నిరుపేదలకు మాత్రమే సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు జైనత్ బిక్కి గంగన్న, బేల మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ మేకల జితేందర్ క్షేత్రస్థాయిలో పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై చైర్మన్ సానుకూలంగా స్పందిస్తూ అర్హులైన వారికి ఖచ్చితంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ఘనంగా గ్రంథాలయ దినోత్సవం

**ఉత్తమ పాఠకులకు సన్మానం**




**తాండూర్:** ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా తాండూర్ శాఖా గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శనతో పాటు ఉత్తమ పాఠకుల సన్మాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వివిధ రకాల పుస్తకాలను ప్రదర్శనకు ఉంచగా, పాఠకులు ఆసక్తిగా వీక్షించారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని కొనియాడారు. ఈ సందర్భంగా ఉత్తమ పాఠకులుగా ఎంపికైన దండ నాయకుల రవిశంకర్, రేవెల్లి చంద్రశేఖర్‌లను సత్కరించారు. పార్ట్‌టైం స్వీపర్ చెరుకుపల్లి స్వామి మాట్లాడుతూ గ్రంథాలయాలు దేవాలయాలతో సమానమని, అలాంటి విజ్ఞాన కేంద్రాలను భవిష్యత్ తరాలకు అందించడం ప్రతిఒక్కరి బాధ్యత అని అన్నారు. ఉత్తమ పాఠకులు మాట్లాడుతూ తాము గ్రంథాలయం గురించి తెలిసినప్పటి నుంచి ప్రతిరోజూ గ్రంథాలయానికి వచ్చి దినపత్రికలు, ఇతర పుస్తకాలు చదువుతున్నామని తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పీసీసీ అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



**తాండూర్:** బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో తెలంగాణ పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయకులు పీసీసీ అధ్యక్షుడిని శాలువాతో ఘనంగా సన్మానించారు. పార్టీ కార్యక్రమాలు, మండల స్థాయి రాజకీయ పరిస్థితులపై పీసీసీ అధ్యక్షుడితో చర్చించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ముడిమడుగుల సురేష్, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎండి ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, నాయకులు మాసాడి తిరుపతి, బెల్లంపల్లి నియోజకవర్గ యూత్ సెక్రటరీ మంతెన శివకృష్ణ, తాండూర్ మండల యూత్ జనరల్ సెక్రటరీ పురంశెట్టి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## భీంపూర్ మండల అధ్యక్షుడికి సన్మానం



**భీంపూర్:** భీంపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుదర్శన్‌ను శుక్రవారం స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తన్వీర్ పటేల్, భీంపూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముశ్రాన్ హైమ్మద్ ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సుదర్శన్ నివాసంలో ఆయనకు శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, మండల అభివృద్ధికి సుదర్శన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అర్లి(టి) సర్పంచ్ కామన్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ కుమారుడిని తక్షణమే అరెస్ట్ చేయాలి



**కాగజ్నగర్:** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై నమోదైన పోక్సో కేసులో వెంటనే చర్యలు తీసుకుని అరెస్ట్ చేయాలని బీఆర్ఎస్ నాయకులు రామటేంకి నవీన్ డిమాండ్ చేశారు. సామాన్యులకు ఒక న్యాయం, అధికార పార్టీలకు మరో న్యాయం అన్నట్లుగా ప్రభుత్వాలు, చట్టాలు పనిచేస్తున్నాయని ఆరోపించారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బండి భగీరథపై కేసు నమోదై ఎనిమిది రోజులు గడిచినా ఇప్పటివరకు పోలీసులు అరెస్ట్ చేయకపోవడం దారుణమన్నారు. ఇదే ఒక సామాన్యుడిపై కేసు నమోదైతే వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపేవారని విమర్శించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిల మధ్య చీకటి ఒప్పందం కారణంగానే ఈ కేసు నీరుగారుతోందని ఆరోపించారు. "గల్లీలో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీ"అన్నట్లుగా ఇద్దరూ రాజకీయ నాటకాలు ఆడుతూ నిందితుడిని కాపాడుతున్నారని అన్నారు. బీజేపీ ఐటీ సెల్ బాధిత కుటుంబాన్ని సోషల్ మీడియాలో కించపరుస్తోందని, ఒక పేద యువతిపై 'హనీట్రాప్'ఆరోపణలు చేయడం దుర్మార్గమన్నారు. పోక్సో చట్ట నిబంధనలకు విరుద్ధంగా బాధిత కుటుంబ వివరాలను బహిర్గతం చేస్తున్నారని ఆరోపించారు. బండి సంజయ్కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే తన కుమారుడిని స్వయంగా పోలీస్ స్టేషన్కు తీసుకెళ్లి అప్పగించాలని డిమాండ్ చేశారు. దేవాలయాల చుట్టూ తిరగడం కంటే చట్టానికి సహకరించాలని సూచించారు. బేటీ బచావో, బేటీ పఢావో అంటూ ప్రచారం చేసే బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. దేశ వ్యాప్తంగా నమోదవుతున్న పోక్సో కేసుల్లో బీజేపీ నాయకుల ప్రమేయం ఎక్కువగా ఉందని ఆరోపించారు. సిర్పూర్ బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు ఇప్పటి వరకు ఈ ఘటనపై స్పందించకపోవడం విచారకరమన్నారు. బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగపురే బండు పటేల్, రామటేంకి మోతిరాం, బొమ్మకంటి ఆనంద్, గోగర్ల సాయి కుమార్, రామటేంకి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి




**సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ, పేషంట్ కేర్ కార్మికులకు పెండింగ్లో ఉన్న మూడు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ, హాస్పటల్ శానిటేషన్ వర్కర్ యూనియన్ గౌరవ అధ్యక్షులు తడికమళ్ళ యోబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని శుక్రవారం సత్తుపల్లి వైద్యాధికారి డాక్టర్ సురేష్ నారాయణకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వంద పడకల ఆసుపత్రి ప్రారంభమై నెలరోజులు గడిచినా అవసరమైన సిబ్బందిని నియమించకుండా 60 మంది చేయాల్సిన పనిని కేవలం 20 మంది కార్మికులతో చేయిస్తున్నారని అన్నారు. దీంతో కార్మికులపై తీవ్ర పనిభారం పడుతోందని తెలిపారు. గత మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం అన్యాయమని, వెంటనే బకాయి జీతాలు విడుదల చేయాలని కోరారు. అలాగే కార్మికుల పీఎఫ్ డబ్బులు ఖాతాల్లో జమ కావడం లేదని, ముగ్గురు కార్మికులకు ఇప్పటివరకు పీఎఫ్ ఖాతాలే ప్రారంభించ లేదని ఆరోపించారు. సంబంధిత కాంట్రాక్టర్పై చర్యలు తీసుకుని కార్మికుల పీఎఫ్ మొత్తాలను వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని, బీమా సౌకర్యం కూడా అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కుమారి, యశోద, పద్మ, లక్ష్మి , శ్రీను, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


# పార్టీ కోసం కష్టపడ్డ వారికి ప్రాధాన్యం

- **కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అయ్యూబ్**
- **ఎస్సీ సెల్ జిల్లా కమిటీల దరఖాస్తుల స్వీకరణకు విశేష స్పందన**



**వరంగల్:** పార్టీ కోసం కష్టపడ్డ వారికి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అయ్యూబ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్సీ సెల్ కమిటీ నియామక అబ్జర్వర్ చిరంజీవిలు అన్నారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ ఎస్సీ సెల్ వరంగల్ జిల్లా కమిటీల నియామకానికి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని శుక్రవారం పోచమ్మ మైదానంలోని గ్రీన్ బావర్చి కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వరంగల్ జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో దళిత నాయకులు పాల్గొని దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీకి సమయం కేటాయిస్తూ కష్టపడి పనిచేసిన నాయకులకు, సీనియర్లకు ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేసే వారిని గుర్తించి బాధ్యతలు అప్పగిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, రాష్ట్రంలో ఎన్నడూలేని విధంగా దళితులకు మంత్రి పదవులు కల్పించిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత విద్యా మండళ్లు సహా అనేక శాఖల్లో దళితులకు ఎక్కువ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన తొలి ప్రభుత్వం కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. దళితులంతా కాంగ్రెస్ పార్టీ వైపు నిలవాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే హాజరైన వారితో పాటు హాజరు కాలేని వారి కోసం మంగళవారం మరోసారి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డిలు కార్యక్రమ స్థలాన్ని త్వరలో ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ పథకంతో సొంతింటి కల సాకారం



**గంభీరావుపేట:** ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ పథకంతో పేద ప్రజల సొంతింటి కల సాకారమవుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ అన్నారు. గంభీరావుపేట మండలం నర్మాల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గృహ ప్రవేశ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ పథకం ద్వారా శాశ్వత నివాసం కల్పించడం సంతోషకరమని పేర్కొన్నారు. మహిళలు సాంప్రదాయ పద్ధతిలో హారతులు పట్టి కార్యక్రమాన్ని జరిపారు. గ్రామ ప్రజలు కొత్త ఇళ్ల నిర్మాణంపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామ అభివృద్ధి అంశాలపై నాయకులు చర్చించారు. ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు ఓరగంటి నర్సింలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చిన్న మల్లయ్య, గోపాల్, మహేందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆర్.లచ్చయ్య, జి.రాయనర్సు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య**



**మంచిర్యాల:** నిరుపేదల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య సూచించారు. శుక్రవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 32వ డివిజన్‌లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనుల పురోగతిని మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలకు గృహ సౌకర్యం కల్పించేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు చేసిందని తెలిపారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అవసరమైన సహాయ సహకారాలు ప్రభుత్వం తరపున అందిస్తామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులతో మాట్లాడి, ఆలస్యానికి గల కారణాలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అవసరమైతే గుత్తేదారులను సమన్వయం చేసుకుని పనులు వేగవంతం చేయాలని సూచించారు. డివిజన్‌లో పర్యటించి స్థానిక సమస్యలను ప్రజల నుంచి తెలుసుకుని, సంబంధిత అధికారుల సమన్వయంతో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధికారి, గృహ నిర్మాణ శాఖ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అలుపెరుగని కమ్యూనిస్టు పోరాట యోధుడు

# మృత్యుం జయుడు

## నేడే ఎరేప మృత్యుంజయుని వర్ధంతి

యజుర్వేద శాఖీయులు అయిన

పేరేప వంశజులు శ్రీకాకుళానికి ఇరవై కిలోమీటర్ల దూరంలోని పేరేప గ్రామ పరిసరాలలో పురోహితులుగా కాక, దేవాలయ ప్రతిష్ఠలు, కళ్యాణాలు చేయించే వేద పండితులుగా పేరెన్నిక గన్నారు. అలాంటి సనాతన వైదిక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి, పక్కా కమ్యూనిస్టుగా పేరొందిన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు పేరేప మృత్యుంజయుడు. నమ్మిన సిద్ధాంతాల కోసం జీవితాన్ని అంకితం చేసిన ఆ త్యాగమూర్తి వర్ధంతి సందర్భంగా, లభ్యం అవుతున్న సమాచారం ఆధారంగా గుర్తు చేసుకునే చిరు ప్రయత్నం.

పేరేప మృత్యుంజయుడు (అక్టోబర్ 5, 1914 – మే 16, 1950) భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు.

పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటలో పేరేప వెంకట సుబ్బయ్య, మహా లక్ష్మిలకు 1914, అక్టోబర్ 5 న జన్మించారు. ఆచంటలో మాధ్యమిక పాఠశాల చదువయ్యాక ధవళేశ్వరం వెళ్లి మేనమామ మొక్కపాటి శేషయ్య ఇంట్లో ఉంటూ రాజమండ్రి ప్రభుత్వ మోడల్ సెకండరీ స్కూలులో చదివి, చదువయ్యాక (1933- 34లో) పి.డబ్ల్యు.డిలో రోజు కూలికి మేస్త్రీగా పని చేశారు. 1925 ప్రాంతంలో భానుమతి (1917)ని వివాహ మాడారు.

1936 లో నెక్కంటి నరసింహారావు, మీరా లతో పాటు కమ్యూనిస్టు పార్టీ సభ్యులయ్యారు. బస్సు డ్రైవరుగా పనిచేస్తున్న మీరాతో పాటు బస్సు కార్మికులను సంఘటిత పరచే కార్యక్రమం చేపట్టారు. 1941-42 ప్రాంతంలో యంవియన్ కపర్దీని కూడా మోటారు కార్మిక సంఘ నిర్మాణంలో పాల్గొనేందుకు ప్రోత్సహించారు. 1937-39 కాలంలో కాళీపట్నం రైతుల పోరాటానికి నాయకత్వం వహించిన అల్లూరి సత్య నారాయణ రాజు, ఉద్దరాజు రామం లతో కలిశారు. 1940-42 కాలంలో చినమల్లం గ్రామం వద్ద 60- 70 మంది పార్టీ కార్యకర్తలకు మృత్యుం జయుడు ప్రిన్సిపాలుగా నిర్వహించిన శిక్షణా శిబిరంలో సైద్ధాంతిక శిక్షణతో బాటు, ఇందుకూరి సుబ్బరాజు ఆధ్వర్యంలో కొంత మిలటరీ శిక్షణ కూడా యిచ్చారు. మృత్యుం జయుడు...వ్యవసాయ కూలీలతో ఆచంట నుంచి నరసాపురం తహశీల్దారు కార్యాలయానికి 1940లో ఆకలి యాత్ర నిర్వహించారు. 1940-42 మధ్య కొంత కాలం ఆయన జిల్లా పార్టీ కార్యదర్శిగా ఉన్నారు. ఏలూరులో జిల్లా పోలీసు స్పెషల్ బ్రాంచి వారు ఆయనను అరెస్టు చేసి, స్థానిక జిల్లా సబ్ జైలులో 15 రోజులు రిమాండులో వుంచారు. 1944 – 45లో జైలు నుంచి విడుదల అయినాక పాలకొల్లులో కాపురం పెట్టారు. నరసాపురం తాలూకా పార్టీ కార్యదర్శిగా వుంటూ, జిల్లా ప్రజానాట్య మండలి ఆర్గనైజరుగా ఉన్నారు. అల్లు రామలింగయ్య, పినిశెట్టి శ్రీరామ మూర్తి, చలం మొదలగు కళాకారులను ప్రజానాట్య మండలిలోకి తెచ్చింది మృత్యుంజయుడే. నెక్కల పూడి సుబ్బాయమ్మ గారితో కలిసి అన్నా చెల్లెలు పాట (బెంగాలులో కరువు) వేదికల మీద పాడే వారు. చావుకు వెరవకురా అన్న పాట తరచు ఒంటరిగా కూడా పాడుకొంటుండే వారని చంద్ర సావిత్రమ్మ, కొండేపూడి రాధ తదితరులు చెపుతుండే వారు. పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, వావిలాల గోపాల కృష్ణయ్య లతో పాటు, ప్రత్యేకంగా తెలంగాణ పోరాటానికి సహాయం కూడ గట్టడానికి పి.సి.జోషి, పుచ్చలపల్లి సుందరయ్యలు వచ్చి ఆయనతో చర్చలు జరిపారు.



మృత్యుంజయుడు నరసాపురం తాలూకా పార్టీ కార్యదర్శిగా, జిల్లా ప్రజానాట్య మండలి ఆర్గనైజరుగా వున్నారు. రెండవ ప్రపంచ యుద్ధపు చివరి రోజుల్లో బెంగాల్ లో భీకరమైన కరువు, తెలంగాణ రైతాంగ పోరాటం నేపథ్యంలో నిత్యావసర వస్తువుల కటకట, దొంగ నిల్వలు, దొంగ రవాణా నివారణకు కృషి చేస్తూ, ఆకలి యాత్రలు నిర్వహించారు. బెంగాలు కరువు, తెలంగాణ పోరాటం గురించి అల్లు రామలింగయ్య, పినిశెట్టి శ్రీరామమూర్తి, చలం మొదలగు కళాకారులతో కలిసి,

ప్రజానాట్య మండలి ప్రదర్శనలు ఇచ్చేవారు. నెక్కల పూడి సుబ్బాయమ్మతో కలిసి "అన్నా చెల్లెలు" పాట (బెంగాలులో కరువుకు సం బంధించి) వేదికల మీద పాడే వారు.

"చావుకు వెరవ కురా" అన్న పాట వేదికల నుంచి గంభీర స్వరంతో పాడడమే కాక, తరచు ఒంటరిగా కూడా పాడుకొంటుండే వారని చంద్ర సావిత్రమ్మ, కొండేపూడి రాధ చెప్పేవారు. నిజంగా జీవితంలో కూడా ఆయన "చావుకి వెరవని" వ్యక్తి.

1945-46లో పాల కొల్లులో మునిసిపల్ కార్మికుల సమ్మె జయప్రదంగా జరగతంలో ఆయన పాత్ర ఉంది. 1946లోనే సాధారణ ఎన్నికలు జరిగిన క్రమంలో, పార్టీ అభ్యర్థి తరఫున పోలింగు ఏజెంటుగా మోటారు సైకిలు మీద నరసాపురం అసెంబ్లీ నియోజకవర్గం అంతా తిరిగారు.

భీమిరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, వావిలాల గోపాల కృష్ణయ్య తెలంగాణ పోరాటానికి సహాయం కూడగట్టడానికి వెళ్ళిన సందరంగంలో పెద్ద బహిరంగ సభ జరిగింది. ఆ తర్వాత, పి.సి.జోషి, పి.సుందరయ్యలు ప్రత్యేకంగా ఆయనతో చర్చలు జరిపారు.

అంతకుముందు "ప్రజాశక్తి" వార పత్రిక, ద్వైవార పత్రికానున్న సందర్భంగా విరాళాలకి ప్రకటన వచ్చింది. ఆయన తనకి పెళ్లికి అత్తవారిచ్చిన వెండి మరచెంబు, కంచం అమ్మి పంపించారు.

1946లోనే మళ్లీ రహస్య జీవితం మొదలయింది. 1948లో గాంధీజీ హత్య తర్వాత మళ్లీ కమ్యూనిస్టు పార్టీ మీద నిషేధం జరిగింది. విజయవాడలో కమ్యూనిస్టు, ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తల మధ్య ఘ-ర్షణలు జరగగా, అరెస్టు అయి కైకలూరు సబ్ జైలులో దాదాపు 3 నెలలున్నాక తప్పించుకొని మళ్ళీ రహస్య జీవితంలోకి వెళ్ళారు.

1948లో పోలీసు చర్య తర్వాత తెలంగాణ లోనే కాక వెన్నుదన్నుగా వున్న కోస్తా ఆంధ్ర జిల్లాలలోనూ కమ్యూనిస్టు శ్రేణులు ఆత్మరక్షణ చేసుకొనే స్థితిలో పడ్డాయి. పార్టీ ఆదేశం ప్రకారం కామ్రేడ్స్ ఇతర ప్రాంతాలకి తరలి వెళ్ళారు. మృత్యుంజయుడు, సంకు అప్పారావు, మరి కొందరు, ఒరిస్సా వెళ్లేందుకు రాజమండ్రిలో ఒక రహస్య స్థావరానికి చేరారు. ఇంతలో స్థావరం యిచ్చిన వ్యక్తి ప్రభుత్వం యిచ్చే పారితోషికానికి ఆశపడి పోలీసులకి ఆచూకీ యిచ్చాడు.

సుందరయ్య 'వీర తెలంగాణ విప్లవ పోరాటం–గుణపాఠాలు" ప్రకారం మిగతా వారిని పంపించి ఆయన ఖమ్మం ప్రాంతంలో పోరాట శ్రేణుల్లో చేరవలసి వచ్చింది.

పట్టుబడిన వారందరూ చిత్ర హింసలకి గురయ్యారు. మృత్యుం జయుడు పట్టుబడిన కబురు తెలిసి అందరూ స్థావరం మార్చుకున్నారు."మా స్థావరం ఆయనకు తెలుసు, వచ్చి మమల్ని కలుసుకోవలసి వుంది. ఆయన ఆ బాధలు భరించినందువల్ల మే బతికిపోయాం" అని రాజేశ్వరరావు, సుందరయ్య చెప్పేవారు. 1950 మే 16 బొమ్మూ రు మొట్ట దగ్గర చనిపోయినట్లు పత్రికల సమాచారం ఇచ్చాయి. కాల్చిన యస్.ఐ తనికెల సుబ్బారావు రిటైరైన తర్వాత... ఫొటోగ్రాఫర్ భూషణ్‌ను కలిసి, కానిస్టేబుళ్ళు మృత్యుంజయుని కాల్చడానికి నిరాకరించగా తాను కాల్చవలసి వచ్చిందని, ఆఖరి గుండు పేల్చే వరకూ ఆయన జయజయ నినాదాలు చేస్తూ నిలబడి వున్నారని చెప్పినట్లు సమాచారం.

అప్పటి సహచరులు, కొరియరులు ఎందరో తమ పిల్లలకు మృత్యుంజయుడు అని పేరు పెట్టు కున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలు దగ్గర రిక్షా కార్మికులు తమ కాలనీకి మృత్యుంజయ నగర్ అని పేరు పెట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపు రంలో "మృత్యుంజయ నగర్ కాలనీ", గ్రంధాలయం ఏర్పడ్డాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# 'శనీశ్వర పూజతో అంతా శుభమే'

## వైశాఖ బహుళ అమావాస్య.... శని జయంతి

"నీలాంజన సమాభాసం ! రవిపుత్రం యమాగ్రజం! ఛాయా మార్తాండ సంభూతం ! తం నమామి శనైశ్చరమ్" !

భారతీయుల జ్యోతిష శాస్త్రం ప్రకారం 'శనీశ్వరుడు', నవగ్రహాలలో ఒక గ్రహం. సూర్యుడు, చంద్రుడు, ఛాయా గ్రహాలైన రాహువు మరియు కేతువులతో కలిపి గ్రహాలు తొమ్మిది. గగన మండలంలో ఉన్న గ్రహాలకు భూమితో సంబంధం ఉంది. కాబట్టి తొమ్మిది గ్రహాల ప్రభావం భూమి మీద, భూమిపై ఉన్న ప్రతి చరాచర జీవుల పైన, నిర్జీవ, ఝడ, నిర్లిప్త వస్తువుల మీద వుంటుంది.

నవగ్రహాలలో ఒకటైన శని గ్రహం ఇందుకు బిన్నం కాదు. శని, శనిగ్రహం, శనేశ్వరుడు, శనీశ్వరుడు, అని పలు నామములతో పిలువబడి, గ్రహ రూపంలో పూజింపబడే 'శని' ఒక గ్రహదేవుడు. వారంలో ఏడవవారం శనివారం. శనికి మంద గమనుడు అని కూడా పేరు. శనై: క్రమతీతి అనగా అతినెమ్మదిగా కదిలేవాడు అని అర్థం. ఒకసారి సూర్యుని చుట్టి రావడానికి శనికి 30 సంవత్సరాలు పడుతుంది. శానైస్కర్య, అసిత, సప్తర్చి, క్రూరదృష్ట, క్రూర లోచనుడు, పంగు పాదుడు, గృధ్ర వాహనుడు మొదలైన పేర్లుకూడా ఉన్నాయి. సంఖ్యలలో 'ఎనిమిది' శనికి ప్రీతికరమయిన సంఖ్య.

ఛాయదేవికి పుట్టిన సంతానం శనిదేవుడు. ఆయనకు ఛాయాపుత్రుడు అనే పేరు కూడా ఉంది. జీవుల జాతక చక్రాలపైన తన ప్రభావాన్ని ఎలా చూప బోతున్నాడో అని నిరూపించడానికి ఆయన జననం సూర్య గ్రహణములో జరిగింది.

దేవతల్లో శని దేవుడికి విశిష్టమైన స్థానముంది. జీవులు చేసిన తప్పులకు ప్రాయశ్చిత్తం కల్పించి, శిక్షించి, ధర్మాన్ని నిలిపే శని భగవానుడు యమ ధర్మరాజుకు అన్న. యముడు మరణానంతరం దండనలు విధిస్తే, శనిదేవుడు వారి వారి కర్మ ఫలములను బట్టి జీవులు బ్రతికి ఉండగానే హింసించి, యాతనలకు గురిచేసి శిక్షిస్తాడు. శనీశ్వరుడు గోచారస్థితి ఫలితంగా ఏలినాటి శని, అష్టమ శని, అర్ధాష్టమ శని, ప్రభావం పడితే అనేక ఇబ్బందులను కలిగిస్తాడు. హిందూ క్యాలెండర్ ప్రకారం వైశాఖ చతుర్దశి అనంతరం వచ్చే అమవాస్య రోజు శని జయంతి జరుపు కుంటారు. సూర్యదేవుని కుమారుడైన శని.. జ్యోతిష శాస్త్రం ప్రకారం మానవుల జీవితంపై తీవ్ర ప్రభావం చూపిస్తాడు. శనీశ్వరుడిని భక్తి శ్రద్ధలతో కొలిచి ఆయన అనుగ్రహం పొందితే కష్టాలు దూరమై.. అదృష్టం కలిసి వస్తుంది. దుష్టశక్తుల నుంచి మనల్ని మనం కాపాడు




కోవడానికి శని దేవున్ని ప్రసన్నం చేసుకోవాలి. అంటే తైలాభిషేకం చేసి శాంతి పూజలు నిర్వహించాలి. బ్రహ్మ వైవర్త పురాణం ప్రకారం, పార్వతీ దేవి, నలుగు పిండి బొమ్మకు ప్రాణం పోసినప్పుడు, వినాయకుడు జన్మించాడు. సకల దేవతలు, నవగ్రహాలు ఆ బాల వినాయకుడిని చూడటానికి వచ్చారు. ఆ ముగ్ధ మోహన బాలుడిని అక్కడకు విచ్చేసిన దేవతలు, మునులు కనులార చూసి, దీవెనలు అందించి, పార్వతీ దేవికి మోదం కలిగించారు. శని భగవానుడు మాత్రం తల ఎత్తి ఆ బాలుని చూడలేదు. అందుకు పార్వతీదేవి కినుక వహించి, తన బిడ్డను చూడమని శనిని ఆదేశించింది. అయినా శని తన దృష్టి, ఆ బాల గణపతి పై సారించలేదు. తన దృష్టి పడితే ఎవరికైనా కష్టాలు తప్పవని ఎంత నచ్చచెప్పినా, మాతృ గర్వంతో శనీశ్వరుడి సదుద్దేశం తెలుసుకోలేక, పార్వతీ దేవి తన కుమారుని చూడమని పదే పదే శనిని ఆదేశించింది. శని తల ఎత్తి చూసిన కారణంగా బాల గణపతి మానవ రూపంలో ఉండే తలను కోల్పోయినాడని బ్రహ్మ వైవర్త తదితరాలు తెలుపు తున్నాయి. శని భగవానుని జన్మ వృత్తాంతం విన్న విక్రమాదిత్యుడు ఆయనను పరిహాసమాడాడట! ఆ పరిహాసాన్ని విన్న శని కోపగ్రస్తుడై విక్రమాదిత్యుని శపించాడట. శనిని కించపరిచే విధంగా మాటలాడి, అవమానించి నందుకు ఫలితంగా విక్రమాదిత్యుడు అనేక కష్టాలు అనుభవించాడు. రాజ్యాన్ని పోగొట్టు కున్నాడు, చేయని దొంగతనపు నింద మోపబడి, పొరుగు రాజుచే కాళ్ళు, చేతులు నరికివేయ బడ్డాడు. చివరికి, విసిగి వేసారి పోయి, బాధలు ఏమాత్రం భరించే ఓపికలేక, నిర్వీర్యుడై, భ్రష్టుడై, చేసేదిలేక, తనను కనికరింపమని శనిదేవుని అత్యంత శ్రద్ధతో, ఆర్తితో, భక్తితో ప్రార్థించగా, విక్రమాదిత్యుని భక్తికి సంతృప్తి చెందిన శనీశ్వరుడు తిరిగి అతని పూర్వ వైభవం ప్రాప్తింప చేసాడు.

శని దశ దుష్ప్రభావాలతో బాధపడే వారు, భక్తితో శని దేవునికి నూనె సమర్పిస్తే చెడు ఫలితాలు పోతాయని విశ్వాసం. శని దేవతను ప్రతిబింబించే నల్ల వస్తువులను... నల్ల ధాన్యాలు, నల్ల మినప్పప్పు, నల్ల నూనెలు, నల్ల ఆవులు, నల్ల బట్టలు, మొదలైనవి దానం చేస్తే చెడు ప్రభావాలు తొలగి పోతాయి.

చీమలకు బెల్లాన్ని ఆహారంగా ఇస్తే శని సంతుష్టుడై ఉంటాడు. శని స్తోత్రాన్ని నిత్యం పఠిస్తే భగవంతుడి ఆశీర్వాదాలు పొందుతారు. జీవితంలో క్లిష్టమైన పరిస్థితులు ఎదుర్కొంటోన్న సమయంలో సూర్య దేవుడి కుమారుడైన, శని దేవుడికి పూజ చేస్తే మంచి ఫలితాలుంటాయి. శనివారం ఉపవాసం ఉండి, శనీశ్వరుడి అనుగ్రహం పొందితే అదృష్టం కలిసి వస్తుంది. శని మనిషి చేసిన చెడు కర్మ ఫలితాన్ని తొలగిస్తాడు. జాతక రీత్యా శని పన్నెండవ ఇంట, ఒకటవ ఇంట, రెండవ ఇంట సంచరిస్తున్నప్పుడు, దానిని "ఏలినాటి శని" లేదా "సాడే సాతి" అంటారు. అయితే ఈ సమయంలో శని ఇచ్చే ఫలితం తాత్కాలికంగా చెడు అనిపించినా, అది ఆ వ్యక్తి భవిష్యత్తుకు ఎంతో సహాయ కారిగా ఉంటుంది. పూర్వ జన్మలో చేసిన పాపాల ప్రయత్నాన్ని కష్టాల రూపంలో శని ఈ సమయంలో తొలగిస్తాడు. తద్వారా ఆ వ్యక్తి కి మంచి భవిష్యత్తు కలుగుతుంది.

మనం ఎంత కష్టం చేస్తే శని అంతా సంతృప్తి చెందుతాడు. కాబట్టి జాతకంలో కానీ, గోచారంలో కానీ, శని అనుకూలంగా లేని వ్యక్తులు శారీరకంగా కష్ట పడటం, అంటే ఇతరులకు సహాయం చేయడం మొదలైనవి చేస్తే ఆ చెడు ఫలితం తగ్గిపోయి శుభ ఫలితాలను శని ఇస్తాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# కమ్యూనికేషన్ ప్రపంచానికి శబ్దాన్ని అందించిన విజ్ఞాన శిల్పి

## మైక్రోఫోన్ ఆవిష్కర్త డేవిడ్ ఎడ్వర్డ్ హ్యూస్ జయంతి నేడు

**మానవ స్వరాన్ని ప్రపంచ దూరాలకు శబ్దంగా పరిచయం చేసిన సంఘటన విజ్ఞాన చరిత్రలో ఓ మైలురాయి. ఈ శబ్ద విప్లవానికి మార్గం వేసిన ఆవిష్కరణ మైక్రోఫోన్. శబ్దాన్ని విద్యుత్ సంకేతాలుగా మార్చే ఈ అద్భుత పరికరాన్ని శాస్త్రీయంగా అభివృద్ధి చేసిన విజ్ఞాన శిల్పి డేవిడ్ ఎడ్వర్డ్ హ్యూస్. ఆయన కమ్యూనికేషన్ రంగానికి మూలస్తంభంగా నిలిచిన శాస్త్రవేత్త. పేటెంట్ హక్కుల ఊహలకు అతీతంగా, పరిశ్రమలకు తన ఆవిష్కరణలు ఉచితంగా అందించాలన్న ఉదారత ఆయనను విశ్వ విజ్ఞాన మాధ్యమాల్లో చిరస్మరణీయుడిగా నిలిపింది.**

1831 మే 16న బ్రిటన్‌లో జన్మించిన డేవిడ్ హ్యూస్ చిన్ననాటి నుంచే సంగీతంపై మక్కువ చూపించాడు. పియానో, మాండలిన్ వాయిద్యాల్లో ప్రావీణ్యం సాధించిన అతను, శబ్ద తరంగాల స్వభావంపై ఆసక్తితో శాస్త్రీయ అధ్యయనానికి పయనమయ్యాడు. 1838లో కుటుంబంతో కలిసి అమెరికాకు వలస వెళ్లిన హ్యూస్, కెంటుకీలోని సెయింట్ జోసెఫ్స్ కళాశాలలో సంగీత ప్రొఫెసర్‌గా స్థిరపడ్డాడు. అయితే సంగీతంలోని శబ్దతత్వం ఆయనను ఎలక్ట్రిక్ విజ్ఞాన ప్రక్రియల వైపు ఆకర్షించింది.


**1855లో అభివృద్ధి చేసిన టైప్-ప్రింటింగ్ టెలిగ్రాఫ్ పరికరం హ్యూస్‌కు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చింది. టెలిగ్రాఫ్ ద్వారా వచ్చిన సంకేతాలను తక్షణమే అక్షరాలుగా ముద్రించ గలిగే ఈ పరికరం కమ్యూనికేషన్ రంగంలో విప్లవాత్మక మార్పుకు కారణమైంది. ఇది ఫ్రాన్స్, ఇటలీ, రష్యా వంటి దేశాలలో అధికారికంగా ఉపయోగించ బడింది.**

1878లో హ్యూస్ రూపొందించిన కార్బన్ మైక్రోఫోన్ ఆధునిక టెలిఫోన్ వ్యవస్థకు మౌలిక పునాదిగా నిలిచింది. శబ్ద తరంగాలను విద్యుత్ ప్రవాహ మార్పులుగా మార్చే ఈ పరికరం, మానవ స్వరాన్ని కిలోమీటర్ల దూరానికీ పంపించ గలిగే సామర్థ్యం కలిగింది. ఆసక్తికరమైనది ఏమంటే, హ్యూస్ తన మైక్రోఫోన్ ఆవిష్కరణకు పేటెంట్ దాఖలు చేయలేదు. శాస్త్రీయ విజ్ఞానాన్ని వ్యక్తిగత లాభానికి ఉపయోగించకుండా, సమాజానికి అందించిన ఉదారత ఆయన గొప్పతనానికి నిదర్శనం.

**వైర్‌లెస్ కమ్యూనికేషన్ పై కూడా హ్యూస్ విశేష ప్రయోగాలు నిర్వహించాడు. 1879లో 500 గజాల దూరానికి వైర్‌లెస్ సంకేతాలను ప్రసారం చేయగలిగిన ఆయన, హర్ట్జ్, మార్కోని కంటే ముందే రేడియో తరంగాలను ప్రయోగాత్మకంగా అన్వేషించాడు. కానీ, ఈ పరిశోధనలకు తగినంత శాస్త్రీయ ప్రామాణికత అందలేదన్న కారణంతో, ఆ కీర్తి ఆయనకు దక్కలేదు. అయినా ఆయన అభివృద్ధి చేసిన ఇండక్షన్ బ్యాలెన్స్ పరికరం ఆధారంగా భవిష్యత్తులో మెటల్ డిటెక్టర్లు రూపొందించ బడ్డాయి.**

తన ఆవిష్కరణలకు గుర్తింపుగా హ్యూస్ 1880లో బ్రిటన్ రాయల్ సొసైటీ ఫెలోగా ఎంపికయ్యాడు. 1885లో రాయల్ మెడల్‌తో సత్కరించ బడ్డాడు. ఫ్రాంక్లిన్ ఇనిస్టిట్యూట్ సహా అనేక అంతర్జాతీయ శాస్త్రీయ సంస్థల నుంచి గౌరవాలు అందుకున్నాడు. అయినప్పటికీ, శాస్త్రానికి సేవ చేయాలన్న లక్ష్యం ఒక్కటే ఆయన్ని నడిపించింది.

**1900 జనవరి 22న హ్యూస్ లండన్‌లో పరమ పదించాడు. ఆయన సాధించిన విజ్ఞాన పునాదులు టెలి కమ్యూనికేషన్, రేడియో, టెలివిజన్, మైక్రోఫోన్, డిజిటల్ ఆడియో వ్యవస్థల్లో నేటికీ ప్రాణంగా కొనసాగు తున్నాయి. శబ్దాన్ని విద్యుత్ భాషలో మార్చిన ఆయన సృష్టి, మానవ సంభాషణలకి సుదూర సంబంధాలే కాదు – సమాజానికి శాశ్వతమైన శబ్ద సంబంధాన్ని అందించిందని చెప్పడంలో సందేహమే లేదు.**




రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ముందస్తు జాగ్రత్తే శ్రీరామరక్ష!

## పరిసరాల పరిశుభ్రతతోనే వైరస్‌కు చెక్..

## నేడు జాతీయ డెంగ్యూ దినోత్సవం..




**ప్రతి సంవత్సరం మే 16న భారత దేశంలో జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని జరుపు కుంటారు. ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం దేశవ్యాప్తంగా ప్రజల్లో డెంగ్యూ జ్వరం గురించి అవగాహన పెంచడం, నివారణ చర్యలను ప్రోత్సహించడం, అలాగే ఈ వ్యాధి యొక్క ప్రమాదకర తీవ్రతను గుర్తించి సకాలంలో చికిత్స తీసుకోవాలన్న సందేశాన్ని కలిగించడం. కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించ బడతాయి.**

డెంగ్యూ, డెంగ్యూ వైరస్ వల్ల కలిగే వైరల్ జ్వరం. ఇది ముఖ్యంగా ఏడిస్ ఈజిప్టి మరియు ఏడిస్ ఆల్బోపిక్టస్ అనే దోమల ద్వారా వ్యాపిస్తుంది. వర్షాకాలం ప్రారంభమైన తర్వాత నీటి నిల్వలు పెరిగిన నేపథ్యంలో ఈ దోమల ఉత్పత్తికి అనుకూలమైన పరిస్థితులు ఏర్పడి, డెంగ్యూ వ్యాప్తికి కారణమవుతున్నాయి. ఇటీవల జనాభా పెరుగుదల, వాతావరణ మార్పుల కారణంగా దేశ వ్యాప్తంగా డెంగ్యూ కేసులు ఏడు రోజూ పెరిగి పోతున్నాయి. ఇది ఇప్పుడు ఒక పెద్ద ప్రజా ఆరోగ్య సమస్యగా మారింది.

డెంగ్యూ లక్షణాలలో అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కళ్ల వెనుక భాగంలో నొప్పి, శరీరంలో ఎరుపు మచ్చలు, వాంతులు, రక్తస్రావం వంటి లక్షణాలు ఉంటాయి. కొంతమందిలో ఈ జ్వరం తీవ్రమైన రూపంలోకి మారి, రక్తపోటు తక్కువ కావడం, అంతర్గత రక్తస్రావం వంటి పరిస్థితులకు దారి తీయగలదు. అంతుచిక్కని ముప్పుగా మారే ఈ వ్యాధిని ఎదుర్కోవాలంటే ముందుగానే గుర్తించడం, జాగ్రత్త చర్యలు తీసుకోవడం చాలా అవసరం.

డెంగ్యూ నివారణకు వ్యక్తిగత, కుటుంబ, సామాజిక స్థాయిలో చర్యలు అత్యంత అవసరం. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూడడం, దోమలు ఉత్పత్తి అయ్యే తాత్కాలిక నీటి నిల్వలను తొలగించడం, వారానికి ఒక రోజు డ్రై డే పాటించి నీటి పాత్రలను ఖాళీ చేయడం వంటి చర్యలు చాలా ప్రభావ వంతంగా ఉంటాయి. దోమల కాటు నుండి రక్షణ కోసం పూర్తిగా శరీరాన్ని కప్పే బట్టలు ధరించడం, దోమలు నివారించే కాయిల్‌లు, క్రీములు వాడటం, దోమ తెరలు ఏర్పాటు చేయడం వంటి ప్రతిరక్షణ చర్యలు కూడా కీలకం.

ఈ దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి ప్రజల్లో డెంగ్యూపై చైతన్యం కలిగించేందుకు ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తాయి. ముఖ్యంగా పోస్టర్లు, కరపత్రాల పంపిణీ, ప్రజలతో సమావేశాలు, ర్యాలీలు, డెంగ్యూ నివారణపై ప్రదర్శనలు జరుగుతాయి. ఆరోగ్య శాఖ డెంగ్యూ పట్ల ముందస్తుగా చర్యలు తీసుకునేలా జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిఘా వ్యవస్థను బలోపేతం చేస్తోంది.

ఈ సంవత్సరం జాతీయ డెంగ్యూ దినోత్సవం థీమ్ "చాషే ఝఖతీశ్రీఎ,ాతీవజవత్ ఐవఅస్త్రబవ: జశ్రీఝఅ ాబతీతీశీబఅఎఅఅస్త్రం, ఎఝశ్రీష్ట్రఎ ాఅజఅఅస్త్ర"గా ప్రకటించ బడింది. దీని ద్వారా ప్రజలందరూ ముందస్తు జాగ్రత్తలు పాటించడం, తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, ఆరోగ్యకరమైన జీవన శైలిని పాటించడం ద్వారా డెంగ్యూను నివారించ గలమన్న సందేశం నొక్కి చెబుతోంది.

డెంగ్యూ నివారణ ప్రభుత్వది మాత్రమే బాధ్యత కాదు. ప్రతి ఇంటి స్థాయి నుంచి సామూహిక స్థాయికి, ప్రతి వ్యక్తి నుంచి సమాజం వరకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించి నప్పుడే డెంగ్యూపై విజయం సాధించగలం. మే 16న జరిగే జాతీయ డెంగ్యూ దినోత్సవం కేవలం ఒక ఆరోగ్య దినోత్సవంగా కాకుండా, సమిష్టిగా తీసుకోవాల్సిన కార్యాచరణ దిశగా మారాలని ఆశిద్దాం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# శుక్రుడిపై 'వీనస్-5' విజయకేతనం నేటికి 57 ఏళ్లు!

## గ్రహాంతర అన్వేషణలో సోవియట్ యూనియన్ చారిత్రక మైలురాయి

## తీవ్ర ఉష్ణోగ్రతలను తట్టుకుని 53 నిమిషాల పాటు కీలక డేటా సేకరణ

**మే 16, 1969... శుక్రగ్రహంపై మానవరహిత నౌక వీనస్-5 విజయ వంతంగా అడుగుపెట్టిన ఆ రోజు, అంతరిక్ష పరిశోధన చరిత్రలో ఒక చారిత్రాత్మక మైలురాయి లాగా నిలిచింది. భూమికి సమీపంగా ఉండే శుక్ర గ్రహం గురించి శాస్త్రీయంగా లోతైన సమాచారాన్ని పొందాలన్న మానవ ఆశయానికి ఇది ప్రతిఫలంగా నిలిచింది. సోవియట్ యూనియన్ అంతరిక్ష పరిశోధనలో చేపట్టిన వీనస్ ప్రోగ్రాంలో భాగంగా రూపొందించిన వీనస్-5 మిషన్, శుక్రగ్రహ ఉపరితలంపై దిగిన రెండవ విజయవంతమైన మిషన్‌గా గుర్తింపు పొందింది.**

1969 జనవరి 5న బైకోనూర్ కాస్మోడ్రోమ్ నుంచి ప్రయాణాన్ని ప్రారంభించిన వీనస్-5 నౌక, సుదీర్ఘ అంతరిక్ష ప్రయాణం తర్వాత మే 16న శుక్రగ్రహ వాతావరణంలోకి ప్రవేశించింది. ఈ మిషన్‌కు ప్రధాన లక్ష్యంగా శుక్ర గ్రహ వాతావరణాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేయడం ఉండగా, పరికరాలుగా బారోమీటర్, థర్మోమీటర్, గ్యాస్ అనలైజర్, మరియు రేడియో కమ్యూనికేషన్ వ్యవస్థలు అమర్చ బడ్డాయి. వీనస్-4 నుంచి వచ్చిన సమాచారాన్ని అధిగమించేలా, మరింత అధునాతనంగా వీనస్-5 తయారు చేయబడింది.

ప్రధాన నౌక నుంచి విడిపోయిన తరువాత దాదాపు 405 కిలోల బరువు గల ల్యాండింగ్ మాడ్యూల్ ఒక పారాచూట్ ఆధారంగా శుక్రగ్రహ వాతావరణంలోకి ప్రవేశించి, దాదాపు 53 నిమిషాలపాటు శుక్రగ్రహ వాయు గోళంలో యాత్ర కొనసాగించింది. ఆ సమయంలో వాతావరణం లోని వివిధ పొరల నుంచి విలువైన డేటాను భూమికి పంపింది. క్రమంగా ఉష్ణోగ్రత పెరగడం, వాయు పీడనం తీవ్రమవడం వంటి అంశాలను ఇది నిక్షిప్తంగా నమోదు చేసింది.

వీనస్-5 ద్వారా సేకరించిన ముఖ్యమైన సమాచారం ప్రకారం, శుక్ర గ్రహ వాతావరణం 97 శాతాలకు పైగా కార్బన్ డయాక్సైడ్‌తో నిండి ఉన్నదని, ఉపరితల ఉష్ణోగ్రత సుమారు 460 నుంచి 470 డిగ్రీల సెల్సియస్ వరకు ఉండొచ్చని, వాతావరణ పీడనం భూమిపై ఉన్నదానికంటే సుమారు 60 రెట్లు అధికంగా ఉండే అవకాశం ఉన్నదని స్పష్టమైంది. ఈ భారీ వాతావరణ ఒత్తిడి మరియు తాప ఉష్ణోగ్రతల వలన ల్యాండర్ తుది ఉపరితలాన్ని చేరిన తర్వాత ఎక్కువసేపు పనిచేయ లేక పోయింది. అయితే, వీనస్-5 అందించిన 53 నిమిషాల డేటా ద్వారా శుక్రగ్రహం మీద మనకు ఉన్న అవగాహనను విస్తరించడంలో గణనీయమైన పురోగతి సాధించ బడింది. భవిష్యత్ శుక్రగ్రహ మిషన్ల రూపకల్పనకు ఇది మార్గదర్శకంగా నిలిచింది. ఈ మిషన్ విజయం సోవియట్ అంతరిక్ష సాంకేతికతను అంతర్జాతీయంగా గుర్తింపుకు నడిపించడంతో పాటు, మానవ నిర్మిత నౌకలు తీవ్రమైన గ్రహ వాతావరణాల్లో పనిచేసే సామర్థ్యాన్ని స్పష్టంగా నిరూపించింది. వీనస్-5 మిషన్ కేవలం శాస్త్రీయ పరిశోధనకు పరిమితమైనదేగాక, అంతరిక్ష పరిశోధనలో సాంస్కృతిక, రాజకీయ విభాగాలకు కూడ విలువను చేకూర్చింది. ల్యాండర్‌తోపాటు సోవియట్ జాతీయ చిహ్నం మరియు లెనిన్ బాస్-రిలీఫ్‌ను శుక్రగ్రహ ఉపరితలంపై ఉంచడం దీన్ని ఒక రాజకీయ ప్రాతినిధ్య ప్రకటనగా కూడా మార్చింది.

**ఈ మిషన్ ద్వారా మానవ జిజ్ఞాస శుక్రగ్రహ దాకా విస్తరించ గలదని సాక్షాత్కరించ బడింది. ఇది కేవలం ఒక అంతరిక్ష ప్రయోగం కాదు, ఒక శాస్త్రీయ విజయగాథ. గ్రహాంతర అన్వేషణలో మానవ చరిత్రలో చెరగని ముద్ర వేసిన ఘట్టం. వీనస్-5 ఇచ్చిన సమాచారాన్ని ఆధారంగా తీసుకుని మానవుడు గ్రహాల వైపు చేసే ప్రయాణాన్ని మరింత శాస్త్రీయంగా, గంభీరంగా తీర్చిదిద్దుకునే దిశగా అడుగులు వేసాడు. మే 16, 1969 అనే తేది శుక్ర గ్రహం మీద మానవ అన్వేషణ తొలి వలయాలను వేసిన ప్రత్యేకమైన దినంగా నిలిచి పోయింది. అంతరిక్ష పరిశోధన చరిత్రలో ఈ ప్రయోగం చిరస్థాయిగా చెరగని ముద్ర వేసింది.**

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# మళ్లీ పెరుగుదల బాటలో పసిడి ధరలు

హైదరాబాద్, మే 14: దేశవ్యాప్తంగా బంగారం ధరలు మరోసారి పెరిగాయి. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు, దిగుమతి సుంకాల పెంపు ప్రభావంతో పసిడి ధరలు వరుసగా ఎగబాకుతున్నాయి. ముఖ్యంగా బంగారం, వెండిపై దిగుమతి సుంకం పెరగడంతో మార్కెట్‌లో ధరలు ఒక్కసారిగా పెరిగినట్లు బులియన్ వ్యాపారులు చెబుతున్నారు. బుధవారం ఉదయం నాటికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు మరింత పెరిగి వినియోగదారులకు షాక్ ఇచ్చాయి. నగరంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.330 పెరిగి రూ.1,62,330కు చేరుకుంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.300 పెరిగి రూ.1,48,800గా నమోదైంది. పెళ్లిళ్ల సీజన్ కొనసాగుతున్న సమయంలో బంగారం ధరలు వరుసగా పెరగడం కొనుగోలుదారులపై అదనపు భారం మోపుతోంది. మరోవైపు వెండి ధర కూడా స్వల్పంగా పెరిగి హైదరాబాద్‌లో కిలో రూ.3,20,100కు చేరుకుంది. దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా ఇదే ధోరణి కనిపిస్తోంది. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,64,180కు చేరగా, 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,50,500గా నమోదైంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,62,330గా ఉండగా, 22 క్యారెట్ల ధర రూ.1,48,800 వద్ద కొనసాగుతోంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,62,260గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,48,950గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న అస్థిరత, అమెరికా ఆర్థిక విధానాలపై ఉన్న ఆందోళనలు, ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడుల వైపు మొగ్గుచూపడం వంటి కారణాలతో బంగారం ధరలు పెరుగుతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. డాలర్ మారకం విలువల్లో మార్పులు, అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతలు కూడా పసిడి ధరలపై ప్రభావం చూపుతున్నాయి. అయితే వెండి ధరల్లో మాత్రం కొన్ని ప్రాంతాల్లో తగ్గుదల కనిపిస్తోంది. దేశంలోని పలు నగరాల్లో కిలో వెండి ధర దాదాపు రూ.10 వేల వరకు తగ్గినట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. చెన్నైలో ప్రస్తుతం కిలో వెండి రూ.3.15 లక్షల వద్ద ఉండగా, ఇతర నగరాల్లో రూ.3 లక్షల వరకు నమోదవుతోంది. బంగారం ధరలు వరుసగా పెరుగుతుండటంతో సాధారణ కొనుగోలుదారులు కొంత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వివాహాలు, శుభకార్యాల కోసం బంగారం కొనుగోలు చేయాల్సిన కుటుంబాలు ధరల పెరుగుదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. మరోవైపు పెట్టుబడిదారులు మాత్రం పసిడిని భద్రమైన పెట్టుబడిగా భావిస్తూ కొనుగోళ్లపై ఆసక్తి చూపుతున్నట్లు మార్కెట్ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

# హైదరాబాద్‌లో వీఐ 5జీ సేవలు ప్రారంభం

**హైదరాబాద్, మే 14:** దేశీయ టెలికాం రంగంలో ఐదు జీ సేవల విస్తరణ వేగంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో ప్రముఖ టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియా హైదరాబాద్ నగరంలో అధికారికంగా ఐదు జీ సేవలను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఇప్పటికే తిరుపతి, విశాఖపట్నం నగరాల్లో ఐదు జీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన సంస్థ, ఇప్పుడు తెలంగాణ రాజధానిలో కూడా ఈ సాంకేతిక సేవలను విస్తరించింది. దేశంలో డేటా వినియోగం అత్యధికంగా ఉన్న ప్రధాన నగరాల్లో హైదరాబాద్ ఒకటిగా నిలుస్తోందని కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో వినియోగదారులకు మరింత వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందించేందుకు నగరంలో ఐదు జీ సేవలను ప్రారంభించినట్లు వెల్లడించాయి. ముఖ్యంగా వీడియో స్ట్రీమింగ్, ఆన్‌లైన్ గేమింగ్, క్లౌడ్ సేవలు, కృత్రిమ మేధస్సు ఆధారిత డిజిటల్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఈ సేవలకు మంచి డిమాండ్ ఉంటుందని భావిస్తున్నట్లు పేర్కొన్నాయి. ఐదు జీ సేవల విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో అనేక టెలికాం టవర్లను ఆధునీకరించినట్లు సంస్థ తెలిపింది. ఆధునిక నెట్‌వర్క్ సాంకేతికతను ఉపయోగించి వినియోగదారులకు అధిక వేగంతో పాటు మెరుగైన కనెక్టివిటీ అందించేలా చర్యలు చేపట్టినట్లు వివరించింది. నగరంలోని కీలక ప్రాంతాల్లో ఇప్పటికే నెట్‌వర్క్ పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఐదు జీ సాంకేతికత ద్వారా వినియోగదారులు అధిక వేగంతో డౌన్‌లోడ్లు, తక్కువ ఆలస్యంతో వీడియో కాల్స్, మెరుగైన డిజిటల్ సేవలను పొందగలరని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా సమాచార సాంకేతిక రంగం, స్టార్టప్ సంస్థలు, డిజిటల్ సేవల రంగానికి హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా మారుతున్న నేపథ్యంలో ఐదు జీ విస్తరణకు ప్రాధాన్యం పెరిగింది. దేశవ్యాప్తంగా ఇప్పటికే పలు టెలికాం సంస్థలు ఐదు జీ సేవలను విస్తరిస్తుండగా, ఇప్పుడు వొడాఫోన్ ఐడియా కూడా తన నెట్‌వర్క్ విస్తరణను వేగవంతం చేస్తోంది. రాబోయే నెలల్లో మరిన్ని నగరాల్లో కూడా ఐదు జీ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని సంస్థ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

# జియో ప్లాట్‌ఫామ్స్ ఎండీగా ఆకాశ్ అంబానీ

**ముంబై, మే 14:** దేశీయ డిజిటల్ రంగంలో కీలక స్థానాన్ని సంపాదించిన జియో ప్లాట్‌ఫామ్స్ సంస్థకు కొత్త నాయకత్వం లభించింది. రిలయన్స్ గ్రూప్ వారసుడిగా గుర్తింపు పొందిన ఆకాశ్ అంబానీను జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించినట్లు సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ నియామకం ఏప్రిల్ 9 నుంచి అమల్లోకి వచ్చినట్లు కంపెనీ తన నియంత్రణ సంస్థలకు సమర్పించిన నివేదికలో వెల్లడించింది. వచ్చే ఐదేళ్ల పాటు ఆయన ఈ బాధ్యతల్లో కొనసాగనున్నట్లు పేర్కొంది. రిలయన్స్‌కు చెందిన డిజిటల్ సేవల విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్ త్వరలో షేర్ మార్కెట్‌లోకి ప్రవేశించేందుకు సిద్ధమవుతున్న వేళ ఈ నియామకం ప్రాధాన్యతను సంతరించుకుంది. సంస్థ ప్రారంభ ప్రజా వాటాల విక్రయం కోసం ముసాయిదా పత్రాలను ఈ నెలాఖరు లేదా వచ్చే నెలలో మార్కెట్ నియంత్రణ సంస్థకు సమర్పించే అవకాశాలు ఉన్నట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో సంస్థ భవిష్యత్ వ్యూహాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఆకాశ్ అంబానీకి కీలక బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఆకాశ్ అంబానీ ఇప్పటికే జియో టెలికాం సేవల విభాగంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. 2014 అక్టోబర్ నుంచి రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ బోర్డు సభ్యుడిగా కొనసాగుతున్న ఆయన, 2022లో సంస్థ ఛైర్మన్‌గా



బాధ్యతలు స్వీకరించారు. యువ నాయకుడిగా టెక్నాలజీ రంగంపై మంచి పట్టు కలిగిన ఆకాశ్, జియో విస్తరణలో ప్రధాన పాత్ర పోషించిన వారిలో ఒకరిగా గుర్తింపు పొందారు. ఆకాశ్ అంబానీ నాయకత్వంలో జియో టెలికాం రంగంలో సంచలన వృద్ధిని నమోదు చేసింది. 2016లో ప్రారంభమైన కొద్ది నెలల్లోనే కోట్లాది వినియోగదారులను ఆకర్షించి దేశీయ టెలికాం రంగంలో భారీ మార్పులకు కారణమైంది. కేవలం ఆరు నెలల్లోనే 10 కోట్ల మంది వినియోగదారులను సొంతం చేసుకుని కొత్త రికార్డు సృష్టించింది. తక్కువ ధరల డేటా సేవలు, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ విస్తరణ ద్వారా జియో దేశవ్యాప్తంగా వేగంగా విస్తరించింది. ఇటీవల విడుదల చేసిన ఆర్థిక గణాంకాల ప్రకారం జియో ప్లాట్‌ఫామ్స్ భారీ ఆదాయాలు నమోదు చేసింది. 2026 ఆర్థిక సంవత్సరానికి గాను సంస్థ రూ.1.46 లక్షల కోట్ల ఆదాయాన్ని, దాదాపు రూ.30 వేల కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు వెల్లడించింది. డిజిటల్ సేవలు, మొబైల్ కమ్యూనికేషన్, వినోదం, ఆన్‌లైన్ సేవల రంగాల్లో జియో విస్తరణ కొనసాగుతున్న నేపథ్యంలో సంస్థ భవిష్యత్‌పై పెట్టుబడిదారుల్లో ఆసక్తి పెరుగుతోంది. జియో ప్లాట్‌ఫామ్స్‌కు ఆకాశ్ అంబానీ నాయకత్వం రావడం ద్వారా డిజిటల్ రంగంలో సంస్థ మరింత దూసుకెళ్లే అవకాశాలు ఉన్నాయని పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు, క్లౌడ్ సేవలు, డిజిటల్ చెల్లింపులు, వినోద రంగాల్లో సంస్థ మరిన్ని విస్తరణ ప్రణాళికలను అమలు చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.

# బ్యాంకుల్లో ఐదు రోజుల పనిదినాలపై మళ్లీ డిమాండ్

**న్యూఢిల్లీ, మే 14:** దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ రంగంలో వారానికి ఐదు రోజుల పనిదినాల అమలుపై మరోసారి చర్చ ప్రారంభమైంది. బ్యాంకు ఉద్యోగ సంఘాలు చాలా కాలంగా చేస్తున్న ఈ డిమాండ్‌ను మళ్లీ కేంద్ర ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లాయి. వారానికి ఐదు రోజుల పని విధానాన్ని తక్షణమే అమలు చేయాలని కోరుతూ బ్యాంకింగ్ ఉద్యోగ సంఘాలు ప్రధాని నరేంద్ర మోదీకు లేఖ రాశాయి. దేశవ్యాప్తంగా బ్యాంకు అధికారులను ప్రాతినిధ్యం వహిస్తున్న ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించింది. ఐదు రోజుల పనిదినాల అమలు కేవలం ఉద్యోగుల సేవా నిబంధనలకు సంబంధించిన అంశం మాత్రమే కాదని, ఇది ఇంధన పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, శక్తి వినియోగ తగ్గింపు, కార్యనిర్వహణ సామర్థ్యం వంటి అనేక ప్రయోజనాలకు దోహదపడుతుందని సంఘం పేర్కొంది. ప్రస్తుతం బ్యాంకు ఉద్యోగులు భారీ పని ఒత్తిడిలో పనిచేస్తున్నారని సంఘం వెల్లడించింది. శాఖల నిర్వహణ, నగదు లావాదేవీలు, వినియోగదారుల సేవలు, రుణ వసూళ్లు, ప్రభుత్వ పథకాల అమలు, గ్రామీణ ఆర్థిక సేవల విస్తరణ




వంటి బాధ్యతల కారణంగా ఉద్యోగులపై ఒత్తిడి పెరుగుతోందని తెలిపింది. ఈ పరిస్థితుల్లో వారానికి ఐదు రోజుల పనివిధానం అమలు చేస్తే ఉద్యోగుల సామర్థ్యం మరింత మెరుగవుతుందని అభిప్రాయపడింది. అలాగే ఈ నిర్ణయం వల్ల దేశవ్యాప్తంగా లక్షలాది మంది బ్యాంకు ఉద్యోగుల ప్రయాణ భారం తగ్గుతుందని సంఘం పేర్కొంది. ఒక రోజు అదనపు సెలవు కారణంగా పెట్రోల్, డీజిల్ వినియోగం తగ్గడంతో పాటు ట్రాఫిక్ రద్దీ కూడా కొంత మేర తగ్గే అవకాశం ఉందని వివరించింది. విద్యుత్ వినియోగం, కార్యాలయ నిర్వహణ ఖర్చులు కూడా తగ్గుతాయని తెలిపింది. ప్రస్తుతం అనేక ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లో ఐదు రోజుల పని విధానం అమలులో ఉందని, బ్యాంకింగ్ రంగంలో కూడా ఇదే విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని ఉద్యోగ సంఘాలు వాదిస్తున్నాయి. ముఖ్యంగా డిజిటల్ బ్యాంకింగ్ సేవలు విస్తరించిన నేపథ్యంలో శాఖలకు ప్రత్యక్షంగా వచ్చే వినియోగదారుల సంఖ్య కూడా గతంతో పోలిస్తే తగ్గిందని పేర్కొంటున్నాయి. ఇక బ్యాంకింగ్ రంగంలో ఐదు రోజుల పని విధానం అమలుపై గతంలో కూడా పలుమార్లు చర్చలు జరిగినప్పటికీ ఇంకా తుది నిర్ణయం వెలువడలేదు. కేంద్ర ఆర్థిక శాఖ, భారతీయ బ్యాంకుల సంఘం, ఉద్యోగ సంఘాల మధ్య ఈ అంశంపై గతంలో చర్చలు జరిగినట్లు సమాచారం. అయితే ఇప్పటి వరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని బ్యాంకు ఉద్యోగ సంఘాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# పాల ధరలు పెంపు.. సామాన్యులకు మరో భారం

**న్యూఢిల్లీ, మే 14:** నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ప్రముఖ డైరీ సంస్థలు మరో షాక్ ఇచ్చాయి. దేశీయ ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ అమూల్ పాలు ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. అమూల్ బ్రాండ్ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసే గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ అన్ని రకాల పాల ప్యాకెట్లపై లీటరుకు రెండు రూపాయల చొప్పున ధరలు పెంచింది. ఈ కొత్త ధరలు మే 14 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ధరల పెంపుతో అరలీటర్ అమూల్ గోల్డ్, అమూల్ తాజా, అమూల్ శక్తి పాల ప్యాకెట్ల ధర ఒక్కో రూపాయి మేర పెరిగింది. లీటర్ అమూల్ గోల్డ్ పాలు ధర 68 రూపాయల నుంచి 70 రూపాయలకు చేరగా, అమూల్ తాజా ధర 55 రూపాయల నుంచి 57 రూపాయలకు పెరిగింది. అమూల్ బాటలోనే మరో ప్రముఖ డైరీ సంస్థ మదర్ డెయిరీ కూడా పాల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. ముఖ్యంగా ఢిల్లీ పరిసర ప్రాంతాలు, ఇతర నగరాల్లో లీటర్ పాలపై రెండు రూపాయల వరకు పెంపు అమలు చేస్తున్నట్లు వెల్లడించింది. గేదె పాలు ధర లీటరుకు 75 రూపాయల నుంచి 80 రూపాయలకు పెరగగా, ఫుల్ క్రీమ్ పాలు ధర 69 రూపాయల నుంచి 72




రూపాయలకు చేరుకుంది. పాల ధరల పెంపుకు అనేక కారణాలు ఉన్నాయని డైరీ సంస్థలు చెబుతున్నాయి. ముఖ్యంగా పశువుల దాణా ధరలు భారీగా పెరగడం ప్రధాన కారణంగా పేర్కొంటున్నాయి. గడ్డి, తవుడు, ఇతర పశు ఆహార పదార్థాల ధరలు పెరగడంతో పాల ఉత్పత్తి వ్యయం గణనీయంగా పెరిగిందని సంస్థలు వెల్లడించాయి. అదేవిధంగా రవాణా ఖర్చులు కూడా పెరిగాయి. పెట్రోల్, డీజిల్ ధరల ప్రభావంతో గ్రామాల నుంచి నగరాలకు పాలను తరలించే వ్యయం అధికమైందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. వేసవి కాలంలో సాధారణంగా పాల దిగుబడి తగ్గడం వల్ల సరఫరాపై ఒత్తిడి పెరిగిందని, దీంతో ధరలు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొంటున్నాయి. ప్యాకేజింగ్ ఖర్చులు, విద్యుత్ ఛార్జీలు, శీతలీకరణ నిర్వహణ వ్యయాలు పెరగడం కూడా ధరల పెంపుకు కారణమయ్యాయి. ఈ అదనపు భారం చివరకు వినియోగదారులపైనే పడుతోందని విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికే కూరగాయలు, వంటనూనెలు, గ్యాస్, ధాన్యాల ధరలు పెరిగిన పరిస్థితుల్లో ఇప్పుడు పాల ధరలు కూడా పెరగడంతో సామాన్య కుటుంబాల నెలవారీ బడ్జెట్‌పై మరింత భారం పడనుంది. ముఖ్యంగా చిన్నపిల్లలు ఉన్న కుటుంబాలు, హోటళ్లు, టీ దుకాణాలు, స్వీట్లు తయారీదారులపై ఈ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశముంది. ధరల పెరుగుదల నేపథ్యంలో కొంతమంది వినియోగదారులు స్థానిక డైరీ కేంద్రాలు, ప్రభుత్వ పాల సరఫరా సంస్థల వైపు మొగ్గు చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలంగాణలో విజయ డెయిరీ వంటి ప్రభుత్వ పాల కేంద్రాల వద్ద ధరలు కొంత వరకు నియంత్రణలో ఉండే అవకాశముందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

# హర్మ్యూజ్ మార్గం దాటిన భారత్ ఇంధన నౌకలు

**న్యూఢిల్లీ, మే 14 :** అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ భారత్‌కు వంటగ్యాస్ సరఫరాలో కీలకమైన పరిణామం చోటుచేసుకుంది. పర్షియన్ గల్ఫ్ ప్రాంతం నుంచి భారత్‌కు ఎల్‌పీజీ తీసుకువస్తున్న రెండు నౌకలు వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హర్మ్యూజ్ జలసంధిని విజయవంతంగా దాటాయి. దీంతో ప్రపంచ ఇంధన రవాణాలో కీలకమైన ఈ సముద్ర మార్గంలో సరఫరాలు మళ్లీ క్రమంగా సాధారణ స్థితికి చేరుతున్నాయనే సంకేతాలు కనిపిస్తున్నాయి. సమాచారం ప్రకారం 'సిమి' పేరుతో ప్రయాణిస్తున్న ఎల్‌పీజీ నౌక గురువారం ఒమన్ గల్ఫ్ ప్రాంతంలోకి ప్రవేశించింది. ఖతార్‌లోని రాస్ లఫాన్ పోర్టు నుంచి బయలుదేరిన ఈ నౌక గుజరాత్‌లోని కాండ్లా పోర్టుకు వస్తోంది. ప్రయాణ సమయంలో భద్రతా కారణాల దృష్ట్యా ఈ నౌక తన ట్రాన్స్‌పాండర్ సంకేతాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు అంతర్జాతీయ నౌకాశ్రయ వర్గాలు తెలిపాయి. ఇక యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని రువాయిస్ రిఫైనరీ నుంచి బయలుదేరిన 'ఎన్వీ సన్‌షైన్' అనే మరో వంటగ్యాస్ నౌక కూడా హర్మ్యూజ్ జలసంధిని దాటి భారత జలాల దిశగా ప్రయాణిస్తోంది. ఈ నౌక కర్ణాటకలోని మంగళూరు పోర్టుకు చేరుకోనున్నట్లు సమాచారం. ఈ నౌక కూడా జలసంధి దాటిన అనంతరం తన సిగ్నల్ వ్యవస్థను నిలిపివేసినట్లు తెలుస్తోంది. ప్రపంచ ముడిచమురు, ద్రవీభవించిన సహజ వాయువు రవాణాలో హర్మ్యూజ్ జలసంధి అత్యంత కీలక పాత్ర పోషిస్తుంది. మధ్యప్రాచ్య దేశాల నుంచి ఆసియా దేశాలకు వెళ్లే ఇంధన సరఫరాలో పెద్ద భాగం ఈ సముద్ర మార్గం ద్వారానే సాగుతుంది. భారత్‌కు అవసరమైన




ముడిచమురు, వంటగ్యాస్ సరఫరాలో కూడా ఈ మార్గం అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంది. అందువల్ల ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరిగిన ప్రతిసారి ప్రపంచ ఇంధన మార్కెట్లపై ప్రభావం పడుతుంది. ఇటీవల అమెరికా, ఇరాన్ మధ్య పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయి. ఇరాన్‌తో కాల్పుల విరమణ చర్చలు క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికా ప్రతిపాదించిన శాంతి ఒప్పందంపై ఇరాన్ స్పందన పూర్తిగా సంతృప్తికరంగా లేదని ఆయన తన సామాజిక మాధ్యమ వేదికలో పేర్కొన్నారు. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఇరాన్ తమ అభిప్రాయాన్ని అమెరికాకు పంపినట్లు అంతర్జాతీయ వర్గాలు చెబుతున్నాయి. ఇలాంటి ఉద్రిక్త పరిస్థితుల్లో కూడా భారత్‌కు ఇంధన నౌకలు సురక్షితంగా చేరుతుండటం కొంత ఊరటనిచ్చే అంశంగా భావిస్తున్నారు. ముఖ్యంగా వంటగ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ఉండటం దేశీయ మార్కెట్‌కు కీలకంగా మారింది. పరిస్థితులను భారత్ నిశితంగా గమనిస్తోందని, అవసరమైతే ప్రత్యామ్నాయ ఇంధన సరఫరా మార్గాలపై కూడా దృష్టి పెట్టే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# అర్ష్‌దీప్ వ్యాఖ్యలపై దుమారం

**ధర్మశాల, మే 15 :** భారత క్రికెటర్ అర్ష్‌దీప్ సింగ్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ముంబై జట్టు బ్యాటర్ తిలక్ వర్మపై అర్ష్‌దీప్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. హోటల్‌లో జరిగిన ఈ ఘటనపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. వైరల్ అవుతున్న వీడియోలో అర్ష్‌దీప్, అటుగా వెళ్తున్న తిలక్ వర్మను సరదాగా పిలుస్తూ మాట్లాడినట్లు కనిపిస్తోంది. ఇద్దరూ కొద్దిసేపు నవ్వుకుంటూ మాట్లాడుకున్నప్పటికీ, అర్ష్‌దీప్ ఉపయోగించిన పదజాలంపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆయన మాట్లాడిన తీరు వర్ణవివక్షను సూచించేలా ఉందని సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది నెటిజన్లు అర్ష్‌దీప్ వ్యాఖ్యలు సరదాగా చేసినవేనని చెబుతుండగా, మరికొందరు మాత్రం ప్రజా వేదికలపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని అభిప్రాయపడుతున్నారు. ప్రముఖ క్రీడాకారులు మాట్లాడే ప్రతి మాట అభిమానులపై ప్రభావం చూపుతుందని, అందువల్ల మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచిస్తున్నారు. అర్ష్‌దీప్ సింగ్ సామాజిక మాధ్యమాల్లో తరచూ సరదా వీడియోలు, చిన్న చిన్న దృశ్యాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. అయితే ఈసారి తిలక్ వర్మతో జరిగిన సంభాషణ వివాదాస్పదంగా మారడంతో క్రికెట్ అభిమానుల మధ్య పెద్ద ఎత్తున చర్చ కొనసాగుతోంది. ఇప్పటివరకు ఈ అంశంపై అర్ష్‌దీప్ సింగ్ గానీ, తిలక్ వర్మ గానీ అధికారికంగా స్పందించలేదు.

# ఆకాశ్ అంబానీకి తగిలిన ఫోన్



**ధర్మశాల, మే 15 :** ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ధర్మశాలలో జరిగిన ముంబై ఇండియన్స్ – పంజాబ్ కింగ్స్ మ్యాచ్ అనంతరం అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ముంబై ఇండియన్స్ విజయం తర్వాత జట్టు యజమాని ఆకాశ్ అంబానీ మైదానంలో అభిమానులతో కలిసి సందడి చేస్తుండగా, ఒక అభిమాని చేతిలోని ఫోన్ అదుపుతప్పి నేరుగా ఆయన ముఖానికి బలంగా తగిలింది. ముంబై విజయం తర్వాత స్టేడియంలో అభిమానులు సెల్ఫీల కోసం ఒక్కసారిగా ముందుకు రావడంతో అక్కడ తోపులాట పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఒక భారీ మొబైల్ ఫోన్ ఎగిరివచ్చి ఆకాశ్ అంబానీ ముఖానికి బలంగా తాకింది. ఒక్కసారిగా షాక్‌కు గురైన ఆయన నొప్పితో అక్కడే ఆగిపోయినట్లు కనిపించారు. ఈ ఘటనతో కొద్దిసేపు వాతావరణం ఉద్రిక్తంగా మారింది. ఫోన్ తగలడంతో ఆకాశ్ అంబానీ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు అక్కడున్నవారు తెలిపారు. పరిస్థితిని గమనించిన భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఆయన చుట్టూ రక్షణ వలయం ఏర్పాటు చేశారు. తన వల్లే ఈ ఘటన జరిగిందని గుర్తించిన అభిమాని వెంటనే క్షమాపణలు కోరాడు. మిగిలిన అభిమానులు కూడా సారీ చెబుతూ పరిస్థితిని చల్లార్చే ప్రయత్నం చేశారు. అభిమానులు కావాలని చేయలేదని అర్థం చేసుకున్న ఆకాశ్ అంబానీ తర్వాత శాంతించారు. అనంతరం మళ్లీ అభిమానులతో కలిసి నవ్వుతూ సెల్ఫీలు దిగడం అక్కడున్నవారిని ఆకట్టుకుంది. ఇదిలా ఉండగా మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ అద్భుత విజయాన్ని నమోదు చేసింది. 201 పరుగుల భారీ లక్ష్యాన్ని మరో బంతి మిగిలి ఉండగానే ఛేదించి ప్లే ఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. ముఖ్యంగా తిలక్ వర్మ తన ధాటైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. కేవలం 33 బంతుల్లోనే 75 పరుగులు చేసి మ్యాచ్‌ను ముంబై వైపు తిప్పేశాడు. తన ఈ ఇన్నింగ్స్‌ను రోహిత్ శర్మకు అంకితం ఇవ్వడం అభిమానులను మరింత ఆకట్టుకుంది.

# ఐపీఎల్‌కు రికార్డు స్థాయి వ్యూయర్‌షిప్




**ముంబై, మే 15 :** ఐపీఎల్ 2026 సీజన్ క్రికెట్ అభిమానులను అలరించడమే కాకుండా, ప్రసార రంగంలో కూడా సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ఈ ఏడాది టోర్నీకి డిజిటల్, టెలివిజన్ మాధ్యమాల్లో భారీ స్థాయిలో ఆదరణ లభిస్తున్నట్లు జియో హాట్‌స్టార్ వెల్లడించింది. కంపెనీ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, గత సీజన్‌తో పోలిస్తే ఈసారి డిజిటల్ వ్యూయర్‌షిప్ దాదాపు 15 శాతం పెరిగింది. ఇప్పటివరకు ఐపీఎల్ మ్యాచ్‌లకు మొత్తం 1.1 బిలియన్లకు పైగా డిజిటల్ వ్యూస్ నమోదయ్యాయి. ఇది ఐపీఎల్ చరిత్రలోనే ఒక కీలక మైలురాయిగా భావిస్తున్నారు. ప్రస్తుతం యువత ఎక్కువగా మొబైల్ ఫోన్లు, ట్యాబ్లెట్లు, స్మార్ట్ పరికరాల ద్వారా మ్యాచ్‌లను వీక్షిస్తోంది. ఎక్కడైనా, ఎప్పుడైనా మ్యాచ్‌లను చూసే సౌకర్యం ఉండటంతో డిజిటల్ స్ట్రీమింగ్‌కు భారీ ఆదరణ పెరిగినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు టెలివిజన్ మాధ్యమం కూడా తన ప్రాధాన్యతను నిలబెట్టుకుంది. ఈ సీజన్‌లో టీవీ వీక్షకుల సంఖ్య 500 మిలియన్ల మార్కును దాటినట్లు వెల్లడించారు. ముఖ్యంగా కుటుంబ సభ్యులు కలిసి ఇంట్లో టీవీల్లో మ్యాచ్‌లను వీక్షించడాన్ని ఇంకా కొనసాగిస్తున్నారని ప్రసార సంస్థలు పేర్కొంటున్నాయి. డిజిటల్, టీవీ రెండింటిలోనూ ఏకకాలంలో భారీ ఆదరణ రావడం వల్ల ఐపీఎల్ బ్రాండ్ విలువ మరింత పెరిగినట్లు మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా వీక్షించబడే క్రీడా లీగ్‌లలో ఐపీఎల్ మరోసారి తన స్థానాన్ని బలంగా నిలబెట్టుకుందని వారు చెబుతున్నారు. ప్రతి సీజన్‌తో కొత్త రికార్డులు సృష్టిస్తూ వస్తున్న ఐపీఎల్, కేవలం క్రికెట్ టోర్నీగానే కాకుండా ప్రపంచస్థాయి వినోద వేదికగా కూడా రూపాంతరం చెందిందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# చెన్నైకి లక్నో పంచ్!

**ఏడు వికెట్ల తేడాతో సూపర్ కింగ్స్ ఘోర పరాజయం**

**చెలరేగిన మిచెల్ మార్ష్..**

**కష్టాల్లో ప్లేఆఫ్ అవకాశాలు**

**ఐపీఎల్ టోర్నీలో చెన్నై సూపర్ కింగ్స్ కు భారీ షాక్ తగిలింది. పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉన్న లక్నో సూపర్ జెయింట్స్ చేతిలో ఏడు వికెట్ల తేడాతో పరాజయాన్ని మూటగట్టుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై నిర్ణీత ఓవర్లలో 187 పరుగులు చేయగా.. లక్నో బ్యాటర్లు కేవలం 16.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించారు. ఈ ఓటమితో చెన్నై ప్లేఆఫ్ ఆశలు తీవ్ర సంక్లిష్టంగా మారాయి.**







**లక్నో, మనసులో మాట:** ఎకానా క్రికెట్ స్టేడియం బి గ్రౌండ్ వేదికగా శుక్రవారం జరిగిన ఉత్కంఠ పోరులో చెన్నై సూపర్ కింగ్స్ పై లక్నో సూపర్ జెయింట్స్ అద్భుత విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. అనంతరం 188 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో జట్టు కేవలం 16.4 ఓవర్లలో మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. ఏకంగా 20 బంతులు మిగిలి ఉండగానే లక్నో గెలుపొందడం విశేషం. పాయింట్ల పట్టికలో ఆఖరి స్థానంలో ఉన్న లక్నో ఈ విజయంతో ఊరట పొందగా.. చెన్నై మాత్రం తీవ్ర నిరాశలో కూరుకుపోయింది.

## కార్తీక్ శర్మ ఒంటరి పోరాటం..

టాస్ గెలిచిన లక్నో జట్టు ఫీల్డింగ్ ఎంచుకోవడంతో చెన్నై బ్యాటింగ్ కు దిగింది. ఓపెనర్ కార్తీక్ శర్మ ఆరంభం నుంచే ధాటిగా ఆడాడు. కేవలం 42 బంతుల్లోనే 71 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించే ప్రయత్నం చేశాడు. మిగతా టాప్ ఆర్డర్ బ్యాటర్లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. చివర్లో శివమ్ దూబే 16 బంతుల్లో అజేయంగా 32 పరుగులు, డెవాల్డ్ బ్రెవిస్ 16 బంతుల్లో 25 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. దీంతో చెన్నై గౌరవప్రదమైన స్కోరు సాధించగలిగింది. లక్నో బౌలర్లలో ఆకాశ్ సింగ్ అద్భుతంగా బౌలింగ్ చేసి నాలుగు ఓవర్లలో 26 పరుగులిచ్చి మూడు కీలక వికెట్లు పడగొట్టాడు. మహ్మద్ షమీ, షాబాజ్ అహ్మద్ చెరో వికెట్ దక్కించుకున్నారు.

## మార్ష్ విధ్వంసకర ఇన్నింగ్స్..

భారీ లక్ష్య ఛేదనలో లక్నో బ్యాటర్లు ఎక్కడా తడబడలేదు. ముఖ్యంగా మిచెల్ మార్ష్ చెన్నై బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 38 బంతుల్లోనే 90 పరుగులు చేసి జట్టు విజయాన్ని ఖాయం చేశాడు. అతడికి తోడుగా జోష్ ఇంగ్లిస్ 32 బంతుల్లో 36 పరుగులు సాధించాడు. చివర్లో నికోలస్ పూరన్ 17 బంతుల్లో అజేయంగా 32 పరుగులు చేసి లాంఛనాన్ని పూర్తి చేశాడు. చెన్నై బౌలర్లు ఏ దశలోనూ లక్నో బ్యాటర్లను కట్టడి చేయలేకపోయారు. ముకేశ్ చౌదరి ఒక వికెట్, స్పెన్సర్ జాన్సన్ ఒక వికెట్ మాత్రమే తీశారు. నూర్ అహ్మద్ తన నాలుగు ఓవర్ల కోటాలో 21 పరుగులిచ్చి పొదుపుగా బౌలింగ్ చేసినా వికెట్ దక్కలేదు.

## సంక్లిష్టంగా చెన్నై ప్లేఆఫ్ దారులు..

ఈ పరాజయంతో చెన్నై సూపర్ కింగ్స్ ప్లేఆఫ్ అవకాశాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పాయింట్ల పట్టికలో ప్రస్తుతం ఆ జట్టు 12 మ్యాచ్ లాడి ఆరు విజయాలు, ఆరు ఓటములతో 12 పాయింట్లు సాధించి ఆరో స్థానంలో కొనసాగుతోంది. ఆ జట్టు నెట్ రన్ రేట్ ప్లస్ 0.027 గా ఉంది. మరోవైపు ఆర్ సీ బీ, గుజరాత్ టైటాన్స్ జట్లు చెరో 16 పాయింట్లతో తొలి రెండు స్థానాల్లో ఉండి దాదాపు ప్లేఆఫ్ బెర్తులను ఖాయం చేసుకున్నాయి. సన్ రైజర్స్ 14 పాయింట్లు, పంజాబ్ కింగ్స్ 13 పాయింట్లు సాధించి చెన్నై కంటే ముందున్నాయి. రాజస్థాన్ రాయల్స్ కేవలం 11 మ్యాచ్ లు మాత్రమే ఆడి 12 పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది. చెన్నై మిగిలి ఉన్న రెండు మ్యాచ్ లలో గెలిచినా గరిష్టంగా 16 పాయింట్లకు మాత్రమే చేరుకుంటుంది. ఇప్పటికే రాజస్థాన్ చేతిలో ఇంకా మూడు మ్యాచ్ లు ఉండటంతో ఆ జట్టు సునాయాసంగా ముందుకు వెళ్లే అవకాశం ఉంది. సన్ రైజర్స్, పంజాబ్ కింగ్స్ జట్లు కూడా చెన్నై పాలిట అడ్డంకిగా మారాయి. చెన్నై ప్లేఆఫ్ చేరాలంటే మిగిలిన రెండు మ్యాచ్ లలో భారీ తేడాతో తప్పక గెలవడంతో పాటు.. రాజస్థాన్, పంజాబ్, సన్ రైజర్స్ జట్లు తమ తదుపరి మ్యాచ్ లలో ఘోరంగా ఓడిపోవాలని ప్రార్థించాల్సిన పరిస్థితి ఏర్పడింది. బంతులు మిగిలి ఉండగానే లక్నో చేతిలో ఓడిపోవడం చెన్నై రన్ రేట్ పై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపింది.

# హీరోలు ఆటకు అవసరమే: ద్రవిడ్



**ముంబై, మే 15:** భారత క్రికెట్ జట్టులో సూపర్ స్టార్ సంస్కృతిని తగ్గించాలనే ప్రస్తుత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆలోచనలతో మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ విభేదించాడు. ఏ క్రీడకైనా హీరోలు చాలా అవసరమని, వారి ప్రదర్శనలే భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని ఆయన స్పష్టం చేశాడు. 2024 టీ20 ప్రపంచకప్‌లో భారత్‌ను విజేతగా నిలిపిన తర్వాత కోచ్ పదవి నుంచి తప్పుకున్న ద్రవిడ్, తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా భారత క్రికెట్‌లో సూపర్ స్టార్ల ప్రాధాన్యతపై తన అభిప్రాయాలను వెల్లడించారు. "ఏ ఆటకు అయినా హీరోలు అవసరం. మైదానంలో అసాధారణ ప్రదర్శనలు చేయకుండా ఎవరూ హీరోలు కాలేరు. ముఖ్యంగా భారతదేశంలో ఆటగాళ్లు ప్రశంసలతో పాటు తీవ్ర విమర్శలు, ఒత్తిడిని కూడా ఎదుర్కోవాల్సి ఉంటుంది. వాటన్నింటిని తట్టుకుని జట్టుకు విజయాలు అందించినప్పుడే ఒక ఆటగాడు లెజెండ్‌గా, సూపర్ స్టార్‌గా ఎదుగుతాడు" అని ద్రవిడ్ పేర్కొన్నారు. గంభీర్ అమలు చేయాలనుకుంటున్న "జట్టే ముఖ్యమని, వ్యక్తిగత స్టార్‌డమ్ అవసరం లేదనే" భావజాలానికి భిన్నంగా ద్రవిడ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇదే సమయంలో భారత టెస్టు జట్టు ఇటీవల ఆశించిన స్థాయిలో రాణించకపోవడంపై కూడా ద్రవిడ్ స్పందించారు. "విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, రవిచంద్రన్ అశ్విన్ వంటి దిగ్గజ ఆటగాళ్లు తప్పుకోవడంతో వారి లోటు స్పష్టంగా కనిపిస్తోంది. అలాంటి ఆటగాళ్ల స్థానాన్ని వెంటనే భర్తీ చేయడం చాలా కష్టం. అయినప్పటికీ భారత క్రికెట్ బలంగానే ఉంది. కొంత సమయం పట్టినా జట్టు మళ్లీ పుంజుకుంటుందని నాకు నమ్మకం ఉంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుత క్రికెట్ షెడ్యూల్‌పై కూడా ద్రవిడ్ ఆందోళన వ్యక్తం చేశారు. "ఇప్పటి ఆటగాళ్లు ఒకేసారి అన్ని ఫార్మాట్లలో ఆడుతున్నారు. పరిమిత ఓవర్ల క్రికెట్ ఎక్కువగా ఉండటంతో టెస్టు సిరీస్‌లకు సిద్ధమయ్యే సమయం వారికి సరిపోవడం లేదు. ఇది ఆటగాళ్ల తప్పు కాదు. ప్రస్తుత క్రికెట్ వ్యవస్థ అలాంటిదిగా మారింది" అని వ్యాఖ్యానించారు. రెడ్ బాల్ క్రికెట్ పట్ల యువ ఆటగాళ్లలో ఆసక్తి ఉన్నప్పటికీ, విపరీతమైన మ్యాచ్‌ల ఒత్తిడి కారణంగా పూర్తి స్థాయిలో టెస్టులకు సిద్ధం కాలేకపోతున్నారని ద్రవిడ్ అభిప్రాయపడ్డారు.

# పాక్ క్రికెట్‌కు ఐసీసీ 'డబుల్ షాక్'

**పాయింట్ల కోత, భారీ జరిమానా**

**బంగ్లాదేశ్ చేతిలో చారిత్రక ఓటమి..**

**స్లో ఓవర్ రేట్‌తో కోలుకోలేని దెబ్బ**

**బంగ్లాకూ తప్పని పెనాల్టీ**



**రావల్పిండి, మే 15:** పాకిస్థాన్ క్రికెట్ జట్టు ప్రస్తుతం అత్యంత దారుణమైన కాలాన్ని ఎదుర్కొంటోంది. మైదానంలో వరుస వైఫల్యాలతో సతమతమవుతున్న ఆ జట్టుకు, అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తీసుకున్న కఠిన నిర్ణయాలు మరో గట్టి దెబ్బ తీశాయి. రావల్పిండి వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో 10 వికెట్ల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసిన పాక్‌కు, క్రమశిక్షణారాహిత్యం కారణంగా ఐసీసీ భారీ జరిమానా విధించింది. నిర్ణీత సమయంలో ఓవర్లను పూర్తి చేయనందుకు (స్లో ఓవర్ రేట్) మ్యాచ్ రిఫరీ రంజన్ మదుగల్లె పాకిస్థాన్ జట్టుపై తీవ్ర చర్యలు తీసుకున్నారు. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో పాక్‌కు ఏకంగా 8 పాయింట్ల కోత విధించారు. ఇప్పటికే పట్టికలో దిగువన ఉన్న పాకిస్థాన్‌కు, ఈ నిర్ణయం కోలుకోలేని దెబ్బగా మారింది. దీనివల్ల ఆ జట్టు ఫైనల్ రేసులో నిలవడం మరింత సంక్లిష్టంగా మారింది. పాయింట్ల కోతతో పాటు, ఐసీసీ ప్రవర్తనా నియమావళి ప్రకారం ఆటగాళ్లందరికీ వారి మ్యాచ్ ఫీజులో 30 నుండి 40 శాతం వరకు జరిమానా విధించారు.

## బంగ్లాదేశ్‌కూ షాక్:

పాకిస్థాన్‌పై చారిత్రక విజయం సాధించి సంబరాల్లో ఉన్న బంగ్లాదేశ్ జట్టుకు కూడా ఐసీసీ షాక్ ఇచ్చింది. ఆ జట్టు కూడా మూడు ఓవర్ల స్లో ఓవర్ రేట్ నమోదు చేయడంతో, 3 డబ్ల్యూటీసీ పాయింట్ల కోతతో పాటు 15 శాతం మ్యాచ్ ఫీజును జరిమానాగా కట్టాలని ఆదేశించింది. సొంతగడ్డపై బంగ్లాదేశ్ చేతిలో టెస్టుల్లో ఓడిపోవడం పాకిస్థాన్ చరిత్రలో ఇదే తొలిసారి. ఒకవైపు బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో వైఫల్యం, మరోవైపు మైదానంలో సమయాన్ని వృథా చేయడం వంటి చర్యలు ఆ జట్టు ప్రతిష్టను దిగజార్చుతున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కెప్టెన్ షాన్ మసూద్ తన వ్యూహాలను మార్చుకోకపోతే, టెస్ట్ ఛాంపియన్‌షిప్ రేసు నుంచి పాక్ పూర్తిగా నిష్క్రమించే ప్రమాదం పొంచి ఉంది.

# థియేటర్ వివాదానికి ముగింపు దిశగా అడుగులు

హైదరాబాద్, మే 15: తెలుగు సినీ పరిశ్రమలో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న థియేటర్ల పర్సంటేజీ విధాన వివాదానికి పరిష్కారం దిశగా కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. నిర్మాతలు, సింగిల్ స్క్రీన్ థియేటర్ల యాజమాన్యాల మధ్య నెలకొన్న విభేదాలను చర్చల ద్వారా ముగించేందుకు తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి ముందుకొచ్చింది. చలనచిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు డి. సురేశ్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో అగ్ర నిర్మాతలు, థియేటర్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా పర్సంటేజీ షేరింగ్ విధానం, థియేటర్ల నిర్వహణ ఖర్చులు, వర్చువల్ ప్రింట్ ఫీజు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం 15 మంది సభ్యులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో ఐదుగురు నిర్మాతలు, ఐదుగురు డిస్ట్రిబ్యూటర్లు, ఐదుగురు ఎగ్జిబిటర్లకు ప్రాతినిధ్యం కల్పించారు. ఈ కమిటీ రెండు నెలల పాటు అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి తమ తుది నివేదికను వాణిజ్య మండలికి సమర్పించనుంది. సమావేశం అనంతరం నిర్మాత సి. కళ్యాణ్ మాట్లాడుతూ పరిశ్రమ ప్రయోజనాల కోసం అందరూ ఏకాభిప్రాయానికి వచ్చారని తెలిపారు. రాబోయే రెండు నెలల్లో ఈ సమస్యకు పూర్తి స్థాయి పరిష్కారం లభిస్తుందని, అప్పటివరకు కొత్త సినిమాల విడుదలలు, థియేటర్ల ప్రదర్శనలు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కీలక సమావేశంలో అల్లు అరవింద్, దిల్ రాజు, చదలవాడ శ్రీనివాసరావు, సుప్రియ యార్లగడ్డ, స్రవంతి రవికిషోర్, మైత్రీ రవి, రాధామోహన్, చెరుకూరి సుధాకర్, భోగవల్లి బాపినీడు, సాహు గారపాటి, సతీష్ కిలారు, సూర్యదేవర నాగవంశీ, ఎస్‌కేఎన్, రాజేష్ దండా, ధీరజ్ మొగిలినేని తదితర ప్రముఖ నిర్మాతలు పాల్గొన్నారు. అలాగే థియేటర్ ఎగ్జిబిటర్ల సంఘం తరఫున విజయేందర్ రెడ్డి, శ్రీధర్ సహా పలువురు ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు. కమిటీ సమర్పించే నివేదిక ఆధారంగా టాలీవుడ్‌లో కొత్త థియేట్రికల్ విధానానికి రూపురేఖలు సిద్ధమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.









## ‘నాగబంధం’లో అనసూయ పవర్‌ఫుల్ లుక్


హైదరాబాద్, మే 15: టాలీవుడ్ యువ హీరో విరాట్ కర్ణ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా ఫాంటసీ థ్రిల్లర్ ‘నాగబంధం’ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకు పెరుగుతోంది. ఐశ్వర్య మీనన్, నభా నటేష్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రం జూలై 3న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా నటి అనసూయ భరద్వాజ్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో అనసూయ గంభీరమైన, మిస్టరీతో నిండిన పాత్రలో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఆమె లుక్‌లో కనిపిస్తున్న తీవ్రత, ప్రత్యేకమైన శైలి సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. ఫాంటసీ మరియు థ్రిల్లర్ అంశాల సమ్మేళనంగా రూపొందుతున్న ఈ చిత్రంలో విరాట్ కర్ణ ఒక విభిన్నమైన పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పోస్టర్లు సినిమాలోని భారీ విజువల్స్ మరియు సాంకేతిక విలువలను ప్రతిబింబిస్తున్నాయి. అనసూయ కీలక పాత్రలో నటిస్తుండటం సినిమాకు మరింత ఆకర్షణగా మారింది. కథలో ఆమె పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యత ఉ ంటుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. జూలై 3న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

## ఆలియా వ్యాఖ్యలపై చర్చ



బాలీవుడ్ ప్రముఖ నటి ఆలియా భట్ అంతర్జాతీయ సినీ ఉ త్సవ వేదికపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటికీ పురుషాధిక్యత కొనసాగుతోందని ఆమె చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. సినిమాల్లో కథ కంటే హీరోలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆలియా అభిప్రాయపడ్డారు. చాలా చిత్రాలు ఇప్పటికీ హీరోల చుట్టూనే తిరుగుతున్నాయని, కథ బలంగా ఉండటమే అసలు ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. సినిమాను విజయవంతం చేసేది కేవలం హీరో కాదని, మంచి కథే ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చెప్పారు. ఆమె వ్యాఖ్యలకు సామాజిక మాధ్యమాల్లో భిన్న స్పందనలు వస్తున్నాయి. కొందరు ఆలియా ధైర్యంగా నిజం మాట్లాడిందని ప్రశంసిస్తుండగా, మరికొందరు మాత్రం తీవ్ర విమర్శలు చేస్తున్నారు. భారతీయ సినిమాను తక్కువ చేసి మాట్లాడుతున్నారని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఇక ఆమె భర్త నటించిన కొన్ని చిత్రాల్లో కూడా పురుషాధిక్యత కనిపించిందని, అలాంటి సినిమాలపై ఎందుకు స్పందించలేదని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. పరిశ్రమలో మార్పు గురించి మాట్లాడేవారు ముందుగా తమ చుట్టూ ఉన్న విషయాలపై స్పందించాలని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. మరోవైపు ఆలియా చెప్పిన విషయాల్లో నిజం ఉందని పలువురు సినీ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. హీరోలకు భారీ పారితోషికాలు, ప్రత్యేక ప్రాధాన్యత, విస్తృత ప్రచారం లభిస్తున్నప్పటికీ హీరోయిన్లకు సమాన గుర్తింపు దక్కడం లేదని చర్చ జరుగుతోంది. గతంలో కూడా పలువురు నటీమణులు సినీ పరిశ్రమలో మహిళలకు సరైన ప్రాధాన్యత దక్కడం లేదని బహిరంగంగానే వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఆలియా వ్యాఖ్యలతో మరోసారి భారతీయ సినిమాల్లో కథలకు ప్రాధాన్యత పెరగాల్సిన అవసరంపై చర్చ మొదలైంది.

# పెద్ది ప్రమోషన్లలో కొత్త ఎమోషన్




## బుచ్చిబాబును లాంగ్ డ్రైవ్ తీసుకెళ్లిన రామ్‌చరణ్

రామ్ చరణ్, బుచ్చిబాబు కాంబినేషన్‌లో వస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ ’పెద్ది’ విడుదలకు సిద్ధమవుతోంది. జూన్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో, చిత్ర యూనిట్ ప్రమోషన్ల స్పీడ్ పెంచింది. సినిమాపై హైప్ క్రియేట్ చేసేందుకు సరికొత్తగా ప్లాన్ చేస్తోంది. తాజాగా హీరో రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు ప్రచారంలో భాగంగా ఒక ప్రత్యేకమైన ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. అయితే ఇది మామూలు ఇంటర్వ్యూలా కాకుండా, రామ్ చరణ్ స్వయంగా కారు డ్రైవ్ చేస్తూ బుచ్చిబాబును ఒక షికారుకి తీసుకెళ్లారు. ప్రయాణంలోనే వీరిద్దరూ సినిమా ముచ్చట్లను పంచుకున్నారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ.. సినిమా పనులతో ఇంత బిజీగా ఉన్నప్పటికీ, నన్ను ఇలా లాంగ్ డ్రైవ్‌కు తీసుకువచ్చినందుకు థాంక్యూ చరణ్ సార్ అంటూ తన ఆనందాన్ని పంచుకున్నారు. దానికి చరణ్ స్పందిస్తూ.. ‘అదంతా సరే కానీ, మన ’పెద్ది’ సినిమా ఎప్పుడు వస్తుందో ప్రేక్షకులకు కచ్చితంగా చెప్పు‘ అని నవ్వుతూ అడిగారు. దీంతో వీరిద్దరూ కలిసి జూన్ 4న ’పెద్ది’ సినిమా థియేటర్లలోకి వస్తోందని అధికారికంగా ప్రకటించారు. భారీ అంచనాలతో వస్తున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులందరూ థియేటర్లలో చూసి ఎంజాయ్ చేయాలని రామ్ చరణ్, బుచ్చిబాబు కోరారు






# ‘దూరదర్శిని’ మూవీ రివ్యూ..

హైదరాబాద్, మే 15 : ప్రస్తుతం చిన్న సినిమాలు కూడా బలమైన కథతో వస్తే ప్రేక్షకులు ఆదరిస్తున్న పరిస్థితి నెలకొంది. అలాంటి కథా బలంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన తాజా చిత్రం ‘దూరదర్శిని’. పేరు వినగానే 90వ దశకపు జ్ఞాపకాలను గుర్తు చేసే ఈ సినిమా నేడు థియేటర్లలో విడుదలైంది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ ప్రేమకథ ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుందో ఇప్పుడు చూద్దాం. మట్టపర్రు అనే పల్లెటూరి నేపథ్యంలో సినిమా సాగుతుంది. చిన్నప్పటి నుంచి ఒకరినొకరు ఇష్టపడే హరి, వాణి ప్రేమకథ చుట్టూనే కథ తిరుగుతుంది. ప్రతి శుక్రవారం దూరదర్శనిలో వచ్చే ‘చిత్రలహరి’ కార్యక్రమం వీరిద్దరినీ మరింత దగ్గర చేస్తుంది. అయితే గ్రామంలో ఉన్న కుల రాజకీయాలు, వాణి కుటుంబ ప్రభావం వీరి ప్రేమకు అడ్డంకిగా మారతాయి. వాణి అన్నయ్య పరశురామ్‌తో హరికి జరిగిన గొడవ తర్వాత కథ ఆసక్తికర మలుపు తిరుగుతుంది. చివరకు తమ ప్రేమను వారు ఎలా గెలిపించుకున్నారు అనేదే సినిమా ప్రధానాంశం. దర్శకుడు కార్తికేయ 90వ దశకపు గ్రామీణ వాతావరణాన్ని చాలా సహజంగా చూపించారు. పల్లెటూరి జీవనం, అప్పటి టెలివిజన్ సంస్కృతి, కుటుంబ భావోద్వేగాలను తెరపై చక్కగా ఆవిష్కరించారు. ముఖ్యంగా ‘చిత్రలహరి’ నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు అప్పటి ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతిని కలిగిస్తాయి. తొలి భాగంలో కథనం కొంత నెమ్మదిగా సాగినా, గ్రామీణ హాస్యం మరియు భావోద్వేగ సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. రెండో భాగంలో కుల వివక్ష, ప్రేమ కోసం చేసే పోరాటం వంటి అంశాలు సినిమాను మరింత బలంగా నిలబెట్టాయి. క్లైమాక్స్‌లో వచ్చే మలుపు ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుంది. హీరోగా నటించిన సువీక్షిత్ తన తొలి చిత్రంలోనే మంచి నటన కనబరిచాడు. హీరోయిన్ గీతికా రతన్ కూడా సహజ నటనతో ఆకట్టుకుంది. హీరో స్నేహితుల పాత్రల్లో కనిపించిన భద్ర, బలరామ్ హాస్యంతో అలరించారు. పరశురామ్ పాత్రలో నటించిన నటుడు తన గంభీరమైన నటనతో మెప్పించాడు. సాంకేతికంగా కూడా సినిమా బాగానే నిలిచింది. ఆనంద్ గుర్రన అందించిన నేపథ్య సంగీతం భావోద్వేగ సన్నివేశాలను మరింత ఎత్తుకు తీసుకెళ్లింది.



పాటలు సాధారణంగా ఉన్నా, నేపథ్య సంగీతం సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. నిర్మాణ విలువలు కథకు తగ్గట్టుగా ఉన్నాయి. అయితే తొలి భాగంలో కొన్ని సన్నివేశాలు సాగదీతగా అనిపించడం సినిమాకు చిన్న మైనస్‌గా మారింది. మొత్తంగా చూస్తే ‘దూరదర్శిని’ పాత జ్ఞాపకాలను గుర్తు చేసే ఒక భావోద్వేగ గ్రామీణ ప్రేమకథ. ముఖ్యంగా 90వ దశకపు అనుభూతులను మళ్లీ ఆస్వాదించాలనుకునే ప్రేక్షకులకు ఈ సినిమా మంచి ఎంపికగా చెప్పొచ్చు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com